గుజరాత్‌పై కేకేఆర్ అద్భుత విజయం



మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక

17.5.2026 ఆదివారం Sunday | సంపుటి (Volume): 11 సంచిక (Issue) : 20 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar


సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్



## ఐసిస్ టెర్రరిస్ట్ అబూ బిలాల్ హతం

నైజీరియాతో కలిసి అంతమొందించిన అమెరికా

మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదిని అంతమొందించినట్లు ట్రంప్ ప్రకటన

.. వివరాలు 4లో



## ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు

భూమ్మీద ప్రపంచ పటంలో పాక్ ఉండదు

పాక్‌ను నేరుగా హెచ్చరించిన ఆర్మీ చీఫ్ ద్వివేదీ

.. వివరాలు 4లో




# సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు

### నెదర్లాండ్స్ పర్యనటలో ప్రధాని మోడీ

### మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం

### యూనికార్న్ సంస్థలు వందకు చేరాయని ప్రకటన

### మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయమని కితాబు

సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు.



## పెట్రో ధరల పెంపు.. ప్రజల నెత్తిన పిడుగు

**ఈ నిర్ణయంతో అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం**

**ధరల పెంపు దారుణం అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ పోస్ట్**



**జనతా న్యూస్, హైదరాబాద్ :** పెట్రో ధరల పెంపు వల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై స్పందించారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్ధనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం

మిగతా 2 లో

## నీట్ పేపర్ లీక్ వ్యవహారం

**ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి**

**మోడీని డిమాండ్ చేసిన రాహుల్**

సంచలనం సృష్టించిన 'నీట్' ప్రశ్నాపత్రం లీక్‌కు సంబంధించి కేంద్రంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ శనివారంనాడు విమర్శలు కొనసాగించారు. తక్షణం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు.



04


## పోలీసులకు లొంగిపోయిన బండి భగీరథ్

**లాయర్ల సమక్షంలో అప్పగించానన్న బండి**

**నార్సింగ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసుల వెల్లడి**

పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడు భగీరథ్‌ను అడ్వకేట్ల సమక్షంలో పోలీసులకు అప్పగించారు. చట్టం మీద గౌరవంతోనే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

02





## మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

**నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలి**

**మంత్రి సీతక్క సూచన**

02

## 2027 డిసెంబర్‌కి దేవాదుల పూర్తి




**అందుబాటులోకి రానున్న 38.16 టీఎంసీలు**

**10 జిల్లాలోని 5.57 లక్షల ఎకరాలకు సాగు నీరు**

**ఇప్పటి వరకు ప్రాజెక్టుకు ఖర్చు రూ.14,422 కోట్లు**

**మరో రూ. 3,978 కోట్లతో ప్రాజెక్టును పూర్తి**

**సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**

దేవాదుల ఎత్తిపోతల పథకం 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు రూట్మ్యాప్ సిద్దం చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. 38.16 టీఎంసీల నీటితో 5.57 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలసి రాష్ట్ర నీటిపారుదల, శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులపై సమీక్షించారు.



## నెలాఖరులోగా భూముల ధరల సవరణ

**హెచ్చు తగ్గులు లేకుండా ధరల క్రమబద్దీకరణ**

**రిజిస్ట్రేషన్ సర్వర్ సమస్య పరిష్కారానికి కొత్త సాఫ్ట్ వేర్**

**సరిహద్దు వివాదాల పరిష్కారానికి జాయింట్ సర్వే**

**జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం**

**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ డ్డి**

02

రాష్ట్రంలో భూముల ధరలను శాస్త్రీయ పద్ధతిలో సవరించేందుకు కసరత్తు చేస్తున్నామని, ఈ నెలాఖరులోగా కొత్త ధరలు అమలులోకి వస్తాయని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

# పెట్రో ధరల పెంపు.. ప్రజల నెత్తిన పిడుగు

మొదటి పేజీ తరువాయి



అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు.మోదీ ప్రభుత్వ అసమర్ధ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సీఎం విమర్శించారు. ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప.. ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయిందని సీఎం అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని... యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందన్నారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందని... ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అంటూ విరుచుకుపడ్డారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని రేవంత్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం' అని పదే పదే ప్రకటించిందని గుర్తుచేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్దాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని... ఇది విశ్వాస ఘాతుకం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## పోలీసులకు లొంగిపోయిన భగీరథ్

### లాయర్ల సమక్షంలో అప్పగించానన్న బండి

### నార్సింగ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసుల వెల్లడి



**హైదరాబాద్,మే16 :** పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడు భగీరథ్‌ను అడ్వకేట్ల సమక్షంలో పోలీసులకు అప్పగించారు. చట్టం మీద గౌరవంతోనే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే.. చట్టానికి అందరూ లోబడి ఉండాల్సిందే అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..'నా కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు ఆరోపణలు వచ్చాయి. చట్టాలపై ఉన్న గౌరవంతో అడ్వకేట్ల ద్వారా పోలీసుల విచారణకు అప్పగించాను. నేను ఇంతకు ముందే చెప్పా.. చట్టం ముందు నా బిడ్డ అయినా, సామాన్యుడైనా సమానమే. అందరం చట్టాలకి లోబడి ఉండాల్సిందే. మా అబ్బాయి ఏ తప్పూ చేయలేదని పదేపదే చెబుతున్నాడు. వాస్తవానికి ఫిర్యాదు రాగానే స్టేషన్‌లో అప్పగిద్దామని అనుకున్నా. లాయర్లను సంప్రదించి మా వద్ద ఉన్న ఆధారాలను నా కుమారుడు వారి ముందుంచాడు. వాటిని చూసి కేసు కొట్టేస్తారని.. బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు. అందుకే కొంత జాప్యం జరిగింది. ఈరోజు కూడా బెయిల్ వస్తుందనే లాయర్లు చెబుతున్నారు. అయితే ఇంకా జాప్యం చేయడం సరికాదని అనుకున్నా. ఆ ఉద్దేశంతో మా అబ్బాయిని తీసుకొచ్చి లాయర్ల ద్వారా విచారణ కోసం అప్పగించాను. న్యాయ వ్యవస్థపై సంపూర్ణమైన నమ్మకం ఉంది. సోమవారం నాడు కోర్టు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ.. న్యాయ వ్యవస్థపై ఉన్న గౌరవంతో ఇంకా ఆలస్యం కావొద్దని విచారణకు అప్పగించా' అని తెలిపారు. అయితే పోలీసుల కథనం మరోలా ఉంది. నార్సింగ్ పోలీస్ అకాడమీ సమీపంలో భగీరథను అదుపులోకి తీసుకున్నామని చెబుతున్నారు. అక్కడి నుంచి అతడిని పేటబషీరాబాద్ స్టేషన్‌కు తరలించామని డిసిపి రమేశ్ రెడ్డి వెల్లడించారు.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

### నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలి : మంత్రి సీతక్క సూచన

**హైదరాబాద్,మే16 :** ఉద్యోగులు హక్కులతో పాటు విధులు కూడా గుర్తుంచుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. స్త్రీనిధి సంస్థను అందరం కాపాడుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి తోడ్పాటు అందిస్తోందని వెల్లడించారు. మైక్రో ఫైనాన్స్ బాధల నుంచి మహిళలకు విముక్తి కోసం స్త్రీనిధి ఏర్పాటయిందని తెలిపారు. ఇప్పటివరకు రూ.24 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసిన స్త్రీనిధి అని చెప్పారు. 32 లక్షల మహిళలకు రుణాలు అందించిందని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలకు నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను అనుసరిస్తున్నాయని.. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్న స్త్రీ నిధి బ్యాంక్‌పై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ఆరోపణలు వస్తే వెంటనే వెరిఫై చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పుడు ఆరోపణలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతినకూడదని మంత్రి వివరించారు. మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధికి పునాది అని చెప్పారు. చిన్న వ్యాపారాలు, గృహాధారిత ఉపాధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిండి. ఆదివాసీ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నాం. స్త్రీనిధి మహిళల కోసం మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ. స్త్రీనిధిని కాపాడుకోవాలి. ఉద్యోగ అనుకూల ప్రభుత్వం మా ప్రభుత్వం. స్త్రీ నిధి ఏర్పాటులో, దాన్ని విజయవంతం చేయడంలో కృషిచేసిన విద్యాసాగర్ రెడ్డికి అభినందనలు. నూతన నాయకత్వంలో ఈ సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నానని మంత్రి సీతక్క వెల్లడించారు.

## రైతు సమస్యలపై అదే నిర్లక్ష్యం

### ధాన్యం సేకరణలో పూర్తి వైఫల్యం: వేముల

**నిజామాబాద్,మే16 :** ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. సిఎం రేవంత్ సమీక్షించినా పరిస్థితిలో మార్పు లేదన్నారు. మక్కులు, వరి ధన్యం కొనుగోలు చేసి, సకాలంలో తరలించకపోవడంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారని అన్నారు. ఎన్నికల ముందు ప్రతి వర్గానికి ఆకర్షణీయమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక రైతులు, వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులను ఇలా అందరినీ మోసం చేసిందని మండిపడ్డారు. జొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి, రైతులకు మద్దతు కల్పించాలని డిమాండ్ చేసారు. రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా మం÷–తరులకు కనిపించడం లేదా అని అన్నారు. రైతులను పట్టించుకోని కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతు భరోసా పేరుతో ఏడాదికి రూ. 15 వేల సాయం, కౌలు రైతులకు ఆర్థిక భరోసా, వరికి బోనస్, ప్రతి పంటకు మద్దతు ధర, రైతుబీమా కొనసాగింపు, వృద్ధులకు పింఛన్ల పెంపు, మహిళలకు భరోసా, నిరు ద్యోగులకు ఉపాధి అవకాశాలు అంటూ అనేక హామీలు ఇచ్చిందని గు ర్తుచేశారు. కానీ నేడు రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు.

వృద్ధులకు భరోసా అందడం లేదని, యువతకు ఉద్యోగ అవకాశాలు కనిపించడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు.

# 2027 డిసెంబర్‌కి దేవాదుల పూర్తి

**అందుబాటులోకి రానున్న 38.16 టీఎంసీలు**

**10 జిల్లాలోని 5.57 లక్షల ఎకరాలకు సాగు నీరు**

**ఇప్పటి వరకు ప్రాజెక్టుకు ఖర్చు రూ.14,422 కోట్లు**

**మరో రూ. 3,978 కోట్లతో ప్రాజెక్టును పూర్తి**

**సమీక్ష సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి**



**హైదరాబాద్ :** దేవాదుల ఎత్తిపోతల పథకం 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు రూట్మ్యాప్ సిద్ధం చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. 38.16 టీఎంసీల నీటితో 5.57 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలసి రాష్ట్ర నీటిపారుదల, శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దేవాదుల ప్రాజెక్టు పెండింగ్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమకుమార్ రెడ్డి మాట్లా డుతూ, 2004–2005లో 6,016కోట్ల అంచనావ్యయం తో మొదలు పెట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం నిర్మాణం గతంలో నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించా రు. ప్రస్తుతం ప్రాజెక్టు అంచనా రూ.18.400 చోట్లకు పెరిగిందన్నారు. మరో రూ.3,978 కోట్లతో 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేసినట్లు ఆయన చెప్పారు. మొత్తం మూడు దశలలో చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని 16 ప్యాకేజిలుగా విభజించి నిర్మాణం పనులు చేపట్టినట్లు తెలిపారు. మొదటి దశలో 1.23 లక్షల ఎకరాలకు, రెండో దశలో 1.93 లక్షల ఎకరాలకు, మూడో ఓ లో 2.39 లక్షల 3ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వసంకల్పమని వివరించారు. 20 పంప్ హౌజ్లు, 642 కిలోమీటర్ల పైపు లైన్లు, 57.16 కిలోమీటర్ల సొరంగ మార్గం, 20 రిజర్వాయర్లు, 306 ప్రధాన కాలువలు, 2,185 కిలోమీటర్లు పంపిణీ కాల్వలకు ఈ ప్రాజెక్టు విస్తరించి ఉందని తెలిపారు. ఆసియాలోనే అతి పొడవైన 40 కిలోమీటర్ల డీ–ఆకారపు సాగునీటి సొరంగం ఈ ప్రాజెక్టులో భాగమని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన 495,55 మెగావాట్ల విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎమ్మక్క –బ్యారేజ్ అనుసంధానంతో ఏడాది పొడవునా నీటి లభ్యత దాదాపు నిరంతరంగా ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 87.70 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. పెండింగ్ భూసేకరణ కేసులను వెంటనే టోకెన్ దశకు తీసుకెళ్లి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు చేయని కాంట్రా కర్ల ఒప్పందాలను వెంటనే రద్దు చేసి, కొత్త టెండర్లు పి "లవాలని ఆదేశించారు. పరిపాలనా అనుమతుల జాప్యాలతో విలువైన సాగునీటి సామర్థ్యం నిలిచిపోవ ద్దని అధికారులకు చెప్పారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కే. ఆర్. నాగరాజు, మురళీ నాయక్, దొంతు మాధ వరెడ్డి, జీ సత్యనారాయణ, రామచంద్ర నాయక్, పల్లా రాజేస్వర్ రెడ్డి, నీటిపారుదలశాఖ ప్రధాన కార్యదర్శి ఈ. శ్రీధర్, సహాయ కార్యదర్శి కే శ్రీనివాస్, సలహాదారు ఆదిత్యా దాస్ నాద్. ఈ ఎన్సీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బోరుబావిలో పడ్డ మనవడు

### రక్షించబోయిన తాత మృతి





**నల్లగొండ,మే16 :** మిర్యాలగూడ మండలంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. మనుమడిని కాపాడబోయి తాత మృతిచెందిన విషాద సంఘటన మిర్యాలగూడ రూరల్ మండలం యాదగిరిపల్లిలో చోటుచేసుకుంది. మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బోరు బావి పక్కన సుమారు 12 అడుగుల గోయి ఏర్పడింది. గ్రామానికి చెందిన వెంకన్న శనివారం ఉదయం తన కూతురు పిల్లలు హేమాన్ష్, లోహితను పొలం వద్దకు తీసుకుని వెళ్లాడు. పనులు చేస్తుండగా మనుమడు హేమాన్ష్ ఆడుకుంటూ బోరు పక్కన ఏర్పడిన గుంతలో పడిపోయాడు. అది గమనించిన వెంకన్న బాలుడిని పైకి తీసే క్రమంలో తాను జారీ తలక్రిందులుగా గుంతలో ఇరుక్కుపోయాడు. పైకి లేచేందుకు ప్రయత్నిస్తే లేవలేకపోతుండడంతో గమనించిన మనుమరాలు భయపడి సమీపంలో ఉన్న రైతులకు విషయం చెప్పింది. వారు బోరు గుంత వద్దకు వచ్చి వెంకన్నను, పిల్లవాడిని రక్షించే ప్రయత్నం చేశారు. రూరల్ ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఓ యువకుడి సాయంతో ఇద్దరిని గుంత నుండి వెలికితీశారు. వైద్య పరీక్షల కోసం మిర్యాలగూడ ఆస్పత్రికి తరలిస్తుండగా వెంకన్న మృతి చెందాడు. బాలుడు సురక్షితంగా ఉన్నాడు. నాలుగేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు బోరుబావిలో పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే బాలుడి తాత వెంకన్న అక్కడకు చేరుకుని చిన్నారిని రక్షించేందుకు బోరుబావిలోకి దిగాడు. ఈ క్రమంలో బోరుబావిలో వెంకన్న తలకిందులుగా ఇరుక్కుపోయాడు. దీంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. పోలీసు బృందం ఎంతో శ్రమించి తాత, మనవడిని బయటకు తీశారు. వెంటనే ఇద్దరినీ స్థానిక ఆస్పత్రికి తరలించారు. అయితే బోరుబావిలో తలకిందులుగా ఇరుక్కోవడంతో ఊపిరాడక వెంకన్న తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.మనవడిని రక్షించబోయి తాత ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ

### ఇంటింటికి వెళ్లి బిఎల్‌వోల పరిశీలన

### సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్,మే16 :** దేశ వ్యాప్తంగా సర్ పక్రియ ప్రారంభమైందని.. తెలంగాణలో జూన్ 25 నుంచి ఈ పక్రియ మొదలవుతుందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వో లు ప్రత్యేక సర్వే చేస్తారని అన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని.. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం–6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని తెలిపారు. హెల్ప్‌లైన్

1950తో పాటు కాల్ యువర్ బిలెస్‌వో సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఎన్యుమరేషన్ దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు. ఫారం ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చుతారని, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1కు ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందని.. 1987 – 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని చెప్పారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రుల పత్రాలు తప్పనిసరన్నారు. 2002లో రాష్ట్రంలో సర్ చేశారని సీఈవో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నదే ఎస్ఐఆర్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 3.45 కోట్ల ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పొలిటికల్ పార్టీలకు కూడా దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యుమరేషన్ తర్వాత డ్రాఫ్ట్ విడుదల చేస్తామని.. అందులో చూసుకొని ఓటర్లు మార్పు, చేర్పులు చేసుకోవచ్చని సీఈవో సుందర్శన్ రెడ్డి వెల్లడించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే, జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల ఉంటుందని అన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల విడుదల చేస్తారు.

## 18న కేరళలో యూడిఎఫ్ ప్రభుత్వం

### నేడు గవర్నర్‌కు మంత్రుల జాబితా

### కాబోయే సిఎం అభ్యర్థి సతీషన్ వెల్లడి

**తిరువనంతపురం,మే16 :** కేరళంలో యూడీఎఫ్ ప్రభుత్వం 18న కొలువు తీరనుంది. మంత్రివర్గం ఏర్పాటుపై భాగస్వామ్య పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, ఈనెల 17వ తేదీ ఆదివారంనాడు మంత్రుల జాబితాను గవర్నర్‌కు అందజేస్తామని ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టనున్నట్టు వీడీ సతీశన్ తెలిపారు. మే 18న తనతో పాటు మంత్రులంతా ప్రమాణస్వీకారం చేస్తారని చెప్పారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ (ఐయూఎంఎల్) నేతలతో శనివారంనాడు సమావేశానంతరం మీడియాతో సతీశన్ మాట్లాడుతూ, రాజకీయ ప్రత్యర్థులు ఎన్ని విమర్శలుచేసినా సెక్యులర్ విధానాన్ని కొనసాగించేందుకు తాము కట్టుబడి ఉన్నట్టు సతీశన్ చెప్పారు. 'కేరళంలో కొన్ని శక్తులు విద్వేష ప్రచారం సాగిస్తున్నాయి.కానీ ముస్లిం లీగ్, వారి నేత పనక్కాడ్ సైయిద్ సాదిఖ్ అలి



బలమైన సెక్యులర్ విధానాలకు కట్టుబడి ఉన్నారు. యూడీఎఫ్ కూడా సెక్యులర్ విధానానికి కట్టుబడి ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం' అని వివరించారు. ఎన్నికల ప్రచారంలో ఐయూఎంఎల్‌తో యూడీఎఫ్ పొత్తును బీజేపీ, సీపీఎం లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు చేశాయని, కానీ ప్రజలు ఆ ఆరోపణలను తిప్పికొట్టి 102 సీట్లలో తమను గెలిపించారని సతీశన్ చెప్పారు. కాగా, దీనికి ముందు కాంగ్రెస్ సీనియర్ నేత రమేష్ చెన్నితాల నివాసానికి వెళ్లి సతీశన్ కలుసుకున్నారు. మంత్రివర్గం కూర్పు, శాఖలపై ఆయనతో చర్చించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్‌పై యూడీఎఫ్ విజయం సాధించింది. 140 స్థానాల్ల 102 సీట్లు గెలుచుకుంది. 2021 నుంచి విపక్ష నేతగా సతీశన్ వ్యవహరిస్తూ ఎల్‌డీఎఫ్‌ను సమర్ధవంతంగా ఎదుర్కోవడంతో ఆయనను సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది.

# నెలాఖరులోగా భూముల ధరల సవరణ



**హెచ్చు తగ్గులు లేకుండా ధరల క్రమబద్ధీకరణ**
**రిజిస్ట్రేషన్ సర్వర్ సమస్య పరిష్కారానికి కొత్త సాఫ్ట్ వేర్**
**సరిహద్దు వివాదాల పరిష్కారానికి రోవర్ల సాయంతో జాయింట్ సర్వే**
**జూన్ 2న రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం**
**రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ డ్డి**

**హైదరాబాద్ :** రాష్ట్రంలో భూముల ధరలను శాస్త్రీయ పద్ధతిలో సవరించేందుకు కసరత్తు చేస్తున్నామని, ఈ నెలాఖరులోగా కొత్త ధరలు అమ లులోకి వస్తాయని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం హైద రాబాద్లో సెక్రటేరియట్ లో మీడియా ప్రతినిధులతొ ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ ఆర్థిక నిపుణుడు అరవింద్ సుబ్రమ ణియన్ సూచనల మేరకు, వాస్తవ ధరలకు అనుగు ణంగా హెచ్చుతగ్గులు లేకుండా ధరలను క్రమం ద్దీకరిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అశాస్త్రి యంగా ధరలు పెంచిందని, 2022 ఏడాదిలోనే రెండు సార్లు పెంచిందని పొంగులేటి విమర్శించారు. రిజిస్ట్రే షన్ల సమయంలో సర్వర్ సమస్యలను పరిష్కరించేం దుకు రూ.14.08 కోట్లతో కొత్త సాఫ్ట్వేర్ ఏర్పాటు చేస్తున్నామని, 3-4 నెలల్లో ఈ సమస్య తీరుతుందని చెప్పారు. రెవెన్యూ, అటవీ భూముల మధ్య దశాబ్దా లుగా ఉన్న సరిహద్దు వివాదాల పరిష్కారానికి రోవర్ల సాయంతో జాయింట్ సర్వే నిర్వహిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రా కపోవడంతో, లబ్ధిదారులనే ఎంపిక చేసి మిగిలిన నిధులు ఇచ్చి వారి ద్వారానే పూర్తి చేయించాలని నిర్ణ యించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు స్థానికంగా ఇసుక, మట్టిని ఉచితంగా పొందేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పాతబడిన వాంబే, ఎన్ఆర్ణేత ఎంఎస్ కాలనీల స్థానం లో కొత్త ఇందిరమ్మ ఇళ్ల మంజూరును పరిశీలిస్తున్నా మన్నారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూము లను విడిపించి, ప్రహరీల ద్వారా రక్షణ కల్పిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలేరు నియో జకవర్గాన్ని 20 వేల ఓటర్ల చొప్పున 14 క్లస్టర్లుగా విభజించి ఇప్పటి వరకు 13 ప్రాంతాలలో ప్రజా దర్బార్ నిర్వహించామనీ, ప్రజల నుంచి వచ్చిన దరఖా స్తుల్లో అత్యధికంగా 52 శాతం ఇందిరమ్మ ఇళ్ల కోసమే ఉన్నాయని, తర్వాత స్థానంలో ధరణి వల్ల ఏర్పడిన భూ సమస్యలు, ఆసరా ఆసరా పెన్షన్లు, పెన్షన్లు, గృహల గృహలక్ష్మి, గ్యాస్ సబ్సిడీ. రేషన్ కార్డులలో కుటుంబీకుల పేర్ల చేర్పు వంటివి ప్రాధాన్యతా క్రమంలో ఉన్నాయ న్నారు. ఆసరా పెన్షన్ల విషయంలో ప్రభుత్వం కచ్చి తమైన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

### కేంద్రం నిధులివ్వకున్నా ఇళ్ల నిర్మాణం ఆగదు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి కేంద్రప్ర భుత్వ వాటా కోసం ఎదురుచూస్తున్నామని, ఒకవేళ కేంద్రం నిధులు విడుదల చేయకపోయినా రాష్ట్ర ప్రభు త్వమే ఆ భారాన్ని భరిస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం స్పష్టం చేశారు. కేంద్రం నుంచి ఒక్కో ఇంటికి సుమారు రూ.1.13 లక్షల వాటా రావాల్సి ఉందని, దానికోసం సీఎం రేవంత్ రెడ్డితో కలిసి పలుమార్లు విన్నవించామ నిమంత్రితెలిపారు. కేంద్రం నుంచినిధులు వస్తాయనే నమ్మకంతో ప్రస్తుతం పూర్తయిన ఇళ్లకు రూ.1,60లక్షల తుది బిల్లును తాత్కాలికంగా ఆపామన్నారు. మరో 15-20" రోజులు వేచి చూసి, కేంద్రం స్పందించకుంటే రాష్ట్ర ప్రభుత్వమే ఆ మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేస్తుందని భరోసా ఇచ్చారు. మొదటి విడతలో మంజూరైన 3.50 లక్షల ఇళ్లలో ఇప్పటికే 1.32 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని తెలిపారు. జూన్ నెలాఖరు కల్లా 70 వేల ఇండ్ల వరకు పూర్తవుతా యని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఆదిలాబాద్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభిస్తారని మంత్రి ప్రకటించారు. ఈ విడతలో నిబంధనలు సడలించి, కేవలం పునాదులు లేదా గోడలు ఉండి ఆగిపోయిన ఇళ్లకు కూడా ఆర్థికసాయం అందిస్తామన్నారు. నియోజకవర్గాల వారీగా ఇళ్ల కేటాయింపుపై ఈనెల 21న జరిగే కేబినెట్ సమా వేశంలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత ప్ర భుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు సుమారు 38 వేల ఇండ్లకు లబ్ధిదారులను ఖరారు చేసింది. తర్వాత ఏడాది పాటు సైంటిఫిక్ సర్వే నిర్వహించగా వీరిలో వీ సుమారు 16 వేల మంది అసలు ఆ ఇళ్లల్లో దిగలేదనీ రేలిందని పొంగులేటి అన్నారు. ఒకే స్థలంలో అన్నదమ్ములు వన్ ప్లస్ వన్ ఇళ్లు కట్టుకునేందుకు ప్ర భుత్వం ఆలోచిస్తుందని తెలిపారు.

# విమానయాన సంస్థలకు భారీ ఊరట

### ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ పై వ్యాట్ తగ్గింపు

**న్యూఢిల్లీ,మే16 :** విమానయాన సంస్థలకు భారీ ఊరట కలిగిస్తూ ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ పై వ్యాట్ ను భారీగా తగ్గించింది. ఏటీఎఫ్పై ప్రస్తుతం ఉన్న వ్యాట్ను 25 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. విమానాలు నడిపేందుకు జెట్ ఇంజన్లలో ఏటీఎఫ్ వినియోగిస్తున్నారు. వ్యాట్ తగ్గింపునకు ఢిల్లీ సర్కార్ తాజా నిర్ణయంతో ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాయాశ్రంలో ఇంధనం కొనుగోలు చేసే విమానయాన సంస్థలు తక్కువ ధరలను చెల్లించే వీలుంటుంది. 'ఏటీఎఫ్పై వ్యాట్ను 25 శాతం నంచి 7 శాతానికి తగ్గించాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఎయిర్లైన్స్కు, సాధారణ ప్రయాణికులకు లబ్ది చేకూరుతుంది' అని ఒక అధికార ప్రకటన విడుదల చేశారు. దీనికి ఒకరోజు ముందు మహారాష్ట్ర ప్రభుత్వం సైతం ఏటీఎఫ్పై వ్యాట్ను 18 శాతం నుంచి 7 శాతానికి తగ్గించింది. మే 15వ తేదీ నుంచి ఆరు నెలల పాటు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు, గ్లోబల్ క్రూడాయిల్ ధరల పెరుగుదల, సరఫరాలో అవాంతరాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. భారతీయ విమానాయాన సంస్థల మొత్తం నిర్వహణ

ఖర్చుల్లో సుమారు 35 నుంచి 45 శాతం జెట్ ఇంధనానికే ఖర్చవుతుంది. ఏటీఎఫ్పై వ్యాట్ తగ్గింపు నిర్ణయంతో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి ప్రముఖ విమానయాన సంస్థలకు ఒకింత ఊరట కలుగనుంది.

# ఢిల్లీ ఎయిర్పోర్టులో భారీగా బంగారం పట్టివేత

### రూ.5.5 కోట్ల విలువైన పసిడి స్వాధీనం

**న్యూఢిల్లీ,మే16 :** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి అక్రమ బంగారం గుట్టురట్టయింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ బంగారం స్మగ్లింగ్ యత్నాలను భగ్నం చేశారు కస్టమ్స్ అధికారులు. పక్కా సమాచారంతో నిఘాపెట్టిన కస్టమ్స్ విభాగం అధికారులు.. అమెరికా నుంచి వచ్చిన ఓ భారత సంతతి వ్యక్తి వద్ద నుంచి రూ.5.5 కోట్ల విలువైన పసిడిని స్వాధీనం చేసుకున్నారు. శాన్ఫ్రాన్సిస్కో నుంచి వచ్చిన సదరు ప్రయాణికుడు ఎవరికీ అనుమానం రాకుండా విమానాశ్రయం నుంచి బయటపడేందుకు యత్నించాడు. అయితే.. అంతర్జాతీయ స్మగ్లర్లు భారీగా బంగారాన్ని భారత్కు తరలిస్తున్నారనే ముందస్తు సమాచారంతో అధికారులు అప్పటికే అలర్ట్ అయ్యారు. సదరు ప్రయాణికుడి కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో కస్టమ్స్ బృందం అతడిని అడ్డుకుని విచారించింది. అతడిని, లగేజీని తనిఖీ చేయగా.. అసలు విషయం వెలుగుచూసింది. అతను ధరించిన ప్రత్యేక బెల్టుతో పాటు ప్యాంటు జేబుల్లో అత్యంత చాకచక్యంగా దాచిన 115 బంగారు బిస్కెట్లను(24 క్యారెట్లు) అధికారులు గుర్తించారు. ఇవి మొత్తం సుమారు 3.5 కిలోల బరువు ఉంటాయని, వీటి మార్కెట్ విలువ దాదాపు రూ.5.5 కోట్ల వరకు ఉ ంటుందని అధికారులు నిర్ధారించారు. నిందితుడిని అరెస్ట్ చేసిన అధికారులు.. ప్రస్తుతం అతని కాల్ డేటా, ప్రయాణ వివరాలు, ఆర్థిక లావాదేవీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తి రవాణాదారు మాత్రమేనని.. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ సిండికేట్ హస్తమున్నట్టు అనుమానిస్తున్నారు. ఇటీవల బంగారంపై దిగుమతి సుంకం పెరగడంతో స్మగ్లింగ్ కేసులు ఎక్కువయ్యాయని.. అందుకే ఎయిర్పోర్టుల్లో అత్యాధునిక స్క్రీనింగ్ టెక్నాలజీ, రిస్క్ ప్రొఫైలింగ్ ద్వారా నిఘాను మరింత తీవ్రం చేసినట్లు వెల్లడించారు కస్టమ్స్ అధికారులు.

# ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర ఇక్కట్లు

### రైతులను ఇబ్బంది పెడుతున్న సర్కార్

### మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



**పెద్దపల్లి,మే16 :** పదేళ్ల కేసీఆర్ పాలన యావత్ తెలంగాణ రైతాంగం రాజులుగా దర్జాగా బతికారని, రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలనలో రైతుల జీవితాలను అగమాగమయ్యాయని రైతుల కంట కన్నీరు పెట్టిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. అంతర్గాం మండలం పెద్దంపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో 'దోచుకో.. దాచుకో..' అనే నినాదం తప్ప, రైతులను ఆదు కునే ధ్యాసే లేదని విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వ యంత్రాంగం చేసిన జాప్యం ఇప్పుడు, రైతుల పాలిటశాపంగా మారిందని మండి పడ్డారు. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతుల అంతా సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో రైతుల కళ్ళల్లో కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని, సకాలంలో ఎరువుల పంపిణీ, రైతుబంధు, ధాన్యం కొనుగోలు చేసి నేరుగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేసినట్లు గుర్తుచేశారు. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉ ండటంతో ఇటీవల అకాల వర్షాలు కురిసి ధాన్యం తడిసి రైతులకు ఇబ్బందులు అయ్యాయని అన్నారు. ధాన్యం బస్తాల్లో కోతలు విధించడంతో రైతుకు ఆర్థికంగా నష్టం జరుగుతుందన్నారు. రాష్ట్రం ప్రభుత్వం వెంటనే వరి ధాన్యం కొనుగోలు చేసి రైతుల ఖాతాలో డబ్బులు జామ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జవహర్ నగర్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**హైదరాబాద్,మే16 :** సికింద్రాబాద్లోని జవహర్నగర్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. వృద్ధ దంపతులను కట్టేసి ఇంట్లో చోరీ చేసిన నేపాలీ ముఠాలో కీలక నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 12న జరిగిన చోరీలో నేపాలీ దంపతులు మమత, రమేశ్తోపాటు సబీనాను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి బంగారం, వెండి, నగదును స్వాధీనం చేసుకున్నారు. 8 మంది నేపాలీ ముఠా సభ్యులు చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు వివరాలను మల్కాజ్గిరి సీపీ సుమతి మీడియాకు వెల్లడించారు. ఈ చోరీ కేసును 250కి పైగా సీసీటీవీ ఫుటేజీలను విశ్లేషించడంతో లభించిన క్లూస్ ఆధారంగా 72 గంటల్లో ఈ కేసును ఛేదించినట్లు మల్కాజ్గిరి సీపీ సుమతి వెల్లడించారు. పక్కా ఎ÷-లాన్తో ఇంట్లోకి ప్రవేశించి చోరీకి తెగబడిన ఈ ముఠాలో నలుగురిని అరెస్టు చేశామని, మిగతా వారి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. మీనా అలియాస్ మమత పుట్టిన రోజు వేడుకల కోసం మిగతా వారు వచ్చారని యజమానులను నమ్మించి.. వృద్ధ దంపతులను కట్టేసి ఈ ముఠా చోరీకి పాల్పడిందని వివరించారు. ఇకపై ఇంటి యజమానులు ఎవరైనా పనిలో పెట్టుకొనేవారి వివరాలను తాము రూపొందించిన యాప్లో నిక్షిప్తం చేయాలని సుమతి సూచించారు. జవహర్నగర్లోని కౌకూర్ గోల్ఫ్ ఎన్క్లేవ్లో విశ్రాంత ప్రొఫెసర్ మురళీధర్ మోహన్ (68), భార్య డాక్టర్ విజయలక్ష్మి (58) నివాసం ఉ ంటున్నారు. నమ్మకంగా పనికి కుదిరిన నేపాలీ దంపతులు పుట్టిన రోజు వేడుకలు చేసుకుంటామని చెప్పారు. యజమాని ఇంట్లో చోరీ చేసేందుకే నేపాలీ వాళ్లను మమత, రమేశ్ రప్పించారు. అర్ధరాత్రి దాటాక ఇంటి యజమానులు మురళీధర్, విజయలక్ష్మి దంపతులను కట్టేసి చోరీకి పాల్పడ్డారు. దాదాపు 75 తులాల బంగారం, 20 కిలోల వెండి, రూ. 30వేల నగదు, 3 వేల డాలర్లతో నేపాలీ ముఠా పరారైంది.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

### 18నుండి 23వరకు క్రీడా పర్యాటక వారోత్సవాలు

### జిల్లా కలెక్టర్లతో సిఎస్ టెలీకాన్ఫరెన్స్

**హైదరాబాద్,మే16 :** ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్ లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలసి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకై ఈ కార్యక్రమాలను

చేపట్టినట్టు తెలిపారు. అదేవిధంగా పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే 'ఫిట్- తెలంగాణా థీమ్ తో రాష్ట్ర , జిల్లా కేంద్రాలలో 5ఐ రన్, అదేవిధంగా అన్ని మండల కేంద్రాలలో వ్యాకథాన్, యోగ తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని, దీనిలో భాగంగా ఈ వారం రోజులు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియంలలో ఉచిత ప్రవేశం కల్పించనున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా జిల్లాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై కూడా జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడ జాప్యం లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

# పెట్రో ధరల పెంపుతో సామాన్యులపై భారం

### హైదరాబాద్లో సిపిఎం నిరసన ప్రదర్శన

**హైదరాబాద్,మే16 :** పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై నేరుగా ప్రభావం పడుతుందని సీపీఐ(ఎం) పొలిట్బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై శనివారం హైదరాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరాన్పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపేలా కృషిచేయాలని డిమాండ్ చేశారు. మోదీ చెబుతున్న పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.దేశం నేడు తీవ్రమైన దుర్భర పరిస్థిలో ఉందని చెప్పారు. నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష వేసే పరిస్థితి నేడు నెలకొందని ఆరోపించారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉ ండదన్నారు. అయితే, ప్రధాన మంత్రి మోడీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహం అయిపోయి ట్రంప్నకు సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు ధరలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, బండారు రవికుమార్, సీనియర్ నేత డీజీ.నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# ఉప్పల్ వరంగల్ రూటులో ట్రాఫిక్ ఆంక్షలు

### వరంగల్ బస్ స్టాప్ నల్లచెరువుకు తరలింపు

**హైదరాబాద్,మే16 :** ఉప్పల్లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగు తున్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉప్పల్ సర్కిల్లోని వరంగల్ బస్టాప్, యాదగిరిగుట్ట బస్టాప్లను నల్లచెరువు కట్ట సమీపానికి మార్చారు. ఉ ప్పల్ వద్ద వరంగల్ వైపు వెళ్లే రహదారిని ఆదివారం నుంచి తాత్కాలికంగా మూసివేయనున్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలను జీఎస్ఐ వద్ద దారి మళ్లించనున్నారు. జీఎస్ఐ జంక్షన్ వద్ద బీరప్పగడ్డ మీదుగా ఎన్హెచ్-163 మీదకు డైవర్ట్ చేయనున్నారు. అలాగే, వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను మేఫీల్ హోటల్ వద్ద దారి మళ్లించనున్నారు. ఉప్పల్ భగాయత్ మీదుగా నాగోల్ సర్వీస్ రోడ్డులో వెళ్లి ఫ్లైఓవ్లగ÷వర్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేశారు. వరంగల్ నుంచి వచ్చే పెద్ద వాహనాలు ఓఆర్ఆర్ మీదుగా హయత్నగర్కు మళ్లిస్తారు. వరంగల్కు వెళ్లే భారీ వాహనాలను హయత్నగర్, ఓఆర్ఆర్ మీదుగా ఘట్కేసర్కు మళ్లించనున్నారు.

మానేరు జనత
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
ఆదివారం 17 మే 2026


# నీట్ పేపర్ లీక్ వ్యవహారం

## ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి.. మోడీని డిమాండ్ చేసిన రాహుల్

**న్యూఢిల్లీ :** సంచలనం సృష్టించిన 'నీట్' ప్రశ్నాపత్రం లీక్‌కు సంబంధించి కేంద్రంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ శనివారంనాడు విమర్శలు కొనసాగించారు. తక్షణం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో 22 లక్షల మంది నీట్ విద్యార్థులు నష్టపోయారని, అయినప్పటికీ ప్రధాని దీనిపై పెదవి విప్పడం లేదని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణం తొలగిస్తారా? స్వయంగా ప్రధానమంత్రే ఇందుకు బాధ్యత వహిస్తారా? అని ప్రశ్నించారు. 'మోదీ జీ... ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇప్పుడే తొలగించండి' అని ఆ ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు. వైద్యకళాశాలల్లో అడ్మిషన్ల కోసం మే 3న నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ పరీక్షలో అవకతవకలు వెలుగుచూడటంతో దీనిని రద్దు చేశారు. దీంతో దేశంలోని నలుమూలల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. జూన్ 21 తిరిగి పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, నీట్ పరీక్షల కోసం రెండేళ్ల పాటు 22 లక్షల మంది విద్యార్థులు రేయింబవళ్లూ కష్టపడ్డారని, వారి కఠోర శ్రమ బూడిదలో పోసిన పన్నీరయిందని అన్నారు. పరీక్షలకు రెండ్రోజుల ముందే నీట్ పేపర్ వాట్సాప్‌లో డిస్ట్రిబ్యూట్ అయిన విషయం యావద్దేశానికి తెలుసునని చెప్పారు. దీనితో తనకెలాంటి సంబంధం లేదని ధర్మేంద్ర ప్రధాన్ చెబుతున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, యూనివర్శిటీ అధికారుల కుమ్మక్కు కావడం వల్లే విద్యావ్యవస్థకు తీవ్రనష్టం జరిగిందని ఆరోపించారు. ప్రతిభ ఆధారంగా కాకుండా సైద్ధాంతిక అనుబంధాల ఆధారంగానే వైస్ ఛాన్సలర్ల నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. వైస్ ఛాన్సలర్ కావడానికి ఎలాంటి సబ్జెక్ట్ నాలెడ్జ్ అవసరం లేదని, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారైతే చాలని, ఈ విషయం యావద్దేశానికి తెలుసునని అన్నారు. ఆర్ఎస్ఎస్ ఐడియాలజీ లేకుంటే ఎప్పటికీ వైస్ ఛాన్సలర్లు కాలేరని అన్నారు. దేశంలో 80 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని, రెండు కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని లెక్కలు చెప్పారు. పేపర్ లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని మరోసారి డిమాండ్ చేశారు.

# ఐసిస్ టెర్రరిస్ట్ అబూ బిలాల్ హతం

## నైజీరియాతో కలసి అంతమొందించిన అమెరికా

## మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాదిని అంతమొందించినట్లు ట్రంప్ ప్రకటన

**వాషింగ్టన్:** ఉగ్రసంస్థ ఐసిస్‌కు చెందిన మరో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టును మట్టుపెట్టామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. నైజీరియా దళాలతో కలిసి అమెరికా దళాలు ఐసిస్ టెర్రరిస్టు అబూ బిలాల్ అల్ మినుకీని అంతం చేశాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలను పర్యవేక్షించే అతడు సంస్థలో నెం.2 నాయకుడిగా ఉండేవాడని ట్రంప్ చెప్పారు. ఆఫ్రికాలో దాక్కుంటే తనను ఎవరు ఏమీ చేయలేరని అతడు భావించాడని అన్నారు. కానీ అతడి సమాచారం తమకు నిత్యం అందుతూనే ఉందన్న విషయాన్ని మాత్రం పసిగట్టలేకపోయాడని ఎద్దేవా చేశారు. ఆఫ్రికా ప్రజలకు అతడి పీడ విరగడయ్యిందని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. అతడి ఉగ్రనీడ తొలగిపోయిందని చెప్పారు. అబూ బిలాల్ అంతంతో ఐసిస్ గ్లోబల్ కార్యకలాపాలకు కూడా పెద్ద దెబ్బతగిలిందని చెప్పారు. ఈ మిషన్‌లో అమెరికా దళాలకు సహకరించిన నైజీరియా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అమెరికా, నైజీరియా సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అతడి మృతితో ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలు మరింత బలహీనమవుతాయని ట్రూత్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు. నా ఆదేశాల మేరకు అమెరికా బలగాలు, నైజీరియా భద్రతా బలగాలు ఐసిస్ అగ్ర కమాండర్ అబు-బిలాల్ అల్-మినూకిని మట్టుబెట్టాయి. ఐసిస్‌లో రెండో అత్యున్నత హోదాలో ఉన్న మినూకి ఆఫ్రికాలో దాక్కోగలనని భావించాడు. కానీ మా గూఢచార వర్గాలు అక్కడా ఉన్నాయనే విషయం తెలుసుకోలేక పోయాడు. ఇక అతడు ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు. అమెరికన్లు లక్ష్యంగా ఆపరేషన్లకు ప్లాన్ చేయడంలో సహకరించలేడు. అమెరికాతో కలిసి పనిచేసిన నైజీరియా ప్రభుత్వానికి థాంక్స్' అని ట్రంప్ రాసుకొచ్చారు. నైజీరియాలో జన్మించిన మినూకి ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ సీనియర్ కమాండర్. ఇస్లామిక్ స్టేట్ తరఫున టెర్రర్ సెల్స్‌కు సూచనలు ఇవ్వడం, అంతర్జాతీయ నిధులను దారి మళ్లించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. ఆ ఆరోపణలతో 2023లో అమెరికా అతడిని ఉగ్రవాదిగా గుర్తించింది.

# ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు

## పాక్‌ను నేరుగా హెచ్చరించిన ఆర్మీ చీఫ్ ద్వివేదీ

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్‌పై దాడులు కొనసాగిస్తే ప్రపంచపటంలో పాకిస్థాన్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. భౌగోళికంగా ఉండాలా లేక చరిత్రలో కలిసిపోవాలా అనేది పాకిస్థాన్ తేల్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పై దాడులు చేసే ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇవ్వడం ఆపాలని ఆయన పాక్‌ను హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని, అందరిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పునరుద్ఘాటించారు. అలాగే గతేడాది పహల్గాం దాడికి ప్రతిస్పందనగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ద్వివేది మాట్లాడారు. ఒవకేళ పాకిస్థాన్ ఉగ్రవాదులను పోషించి, వాళ్లను ఇండియా మీదకు ఉసి గొల్పితే, అప్పుడు ఆ దేశం ఈ భూమ్మీద ఉండాలా లేదా అన్న అంశాన్ని వాళ్లే నిర్ణయించు కోవాల్సి ఉంటుందన్నారు. చరిత్రలో ఆ దేశానికి స్థానం ఉండాలంటే ఉగ్రవాదులను పెంచి పోషించరాదన్నారు. మానేక్‌షా సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవేళ ఆపరేషన్ సింధూర్ చేపట్టడానికి దారి తీసిన పరిస్థితులు మళ్లీ వస్తే ఏం చేస్తారని ఆయన్ను ప్రశ్నించారు. జనరల్ ద్వివేది తన వ్యాఖ్యల్లో పాకిస్తాన్‌కు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇండియా నిలుస్తుందన్నారు. గత ఏడాది మే 7వ తేదీన పాక్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత పాక్ దాడులు చేసినా.. ఇండియా వాటిని తిప్పికొట్టింది. సుమారు 88 గంటల పాటు రెండు దేశాలు యుద్ధం కొనసాగించాయి. మే 10వ తేదీ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగింది.

# నీట్ పేపర్ లీక్ కేసు

## పుణెకు చెందిన బాటనీ టీచర్ మనీషా అరెస్ట్

**పుణె :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మరో కీలక సూత్రధారి, పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా మందారేను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆమె నీట్ బయాలజీ ప్రశ్నాపత్రం లీక్ కావడంలో కీలక పాత్ర పోషించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పుణెకు చెందిన మనీషా బోటనీ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు మనీషాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పక్రియలో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా నియమించింది. ఏప్రిల్ నుంచి ఆమె కొందరు నీట్ అభ్యర్థులకు తన ఇంటి వద్దే శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆ సమయంలోనే ఆమె వారికి నీట్ పరీక్షకు సంబంధించిన బోటనీ, జువాలజీ పేపర్లలోని ప్రశ్నలను లీక్ చేశారు. ఆ ప్రశ్నలను నోట్ బుక్‌లో రాసుకోవాలని, టెక్ట్స్ బుక్‌లో మార్క్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆమె లీక్ చేసిన ప్రశ్నలు మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షలోని ప్రశ్నలతో సరిపోలినట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు . ఇప్పటికే ఈ కేసులో పుణెకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణిని కూడా సీబీఐ అరెస్ట్ చేసింది. కులకర్ణి గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. కాగా, నీట్ ప్రశ్నాప్రతం లీకేజీ వ్యవహారంలో ఇప్పటివరకు ఢిల్లీ, జైపూర్, నాసిక్, పుణె, గురుగ్రామ్, అహిల్యానగర్ నుంచి తొమ్మిది మందిని సీబీఐ అరెస్ట్ చేసింది.

# సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు

**నెదర్లాండ్స్ పర్యనటలో ప్రధాని మోడీ**

**మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం**

**యూనికార్న్ సంస్థలు వందకు చేరాయని ప్రకటన**

**మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయమని కితాబు**



**న్యూఢిల్లీ,మే16 :** సెమికండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమికండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలనుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవి. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయి. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారు. ఈయూ దేశాల జనాభా మొత్తం కలిపినా 64 కోట్ల మంది కూడా లేరని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు.

నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ వారితోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు వారితోనే ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యా యనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

# విదేశీ పర్యటనలపై పన్ను అంటూ కథనాలు

## ఓ టీవీ ఛానల్ కథనంపై మోడీ స్పందన

## అలాంటిదేమీ లేదంటూ ఎక్స్‌లో పోస్ట్

**న్యూఢిల్లీ:** విదేశీ పర్యటనలపై కూడా కేంద్ర ప్రభుత్వం పన్ను లేదా సర్‌చార్జ్ విధించేందుకు యోచిస్తోందంటూ వచ్చిన వార్తలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. ఆ కథనంలో నిజమనేదే లేదని తేల్చి చెప్పారు. పశ్చిమాసియా ఘర్షణలతో ముడిచమురు ధరలు పెరగడం, రూపాయి మారకం విలువ అంతకంతకూ పతనం అవుతున్న నేపథ్యంలో ఆర్థిక రంగంపై ఒత్తిడి తగ్గించేందుకు ప్రభుత్వం విదేశీ పర్యటనలపై తాత్కాలికంగా పన్ను విధించేందుకు యోచిస్తోందని సీఎన్‌బీసీఒక కథనాన్ని ప్రసారం చేసింది. ఈ కథనంపై ప్రధాని ఘాటుగా స్పందించారు. 'ఇది పూర్తిగా అసత్యం. ఈ కథనంలో వాస్తవమనేదే లేదు. విదేశీ పర్యటనలపై ఆంక్షలు విధించే ప్రశ్నే లేదు. వ్యాపార నిర్వహణ, ప్రజల జీవనాన్ని మరింత సౌకర్యవంతంగా మార్చేందుకు మేము కట్టుబడి ఉన్నాము' అని ప్రధాని ఎక్స్ వేదికగా స్పష్టతనిచ్చారు. ప్రధాని పోస్టు తరువాత ఆ వార్తా ఛానల్ కూడా తన కథనాన్ని ఉపసంహరించుకుంది. తమ కథనంలో కచ్చితత్వం లోపించిందని అంగీకరించింది. ఈ తప్పిదానికి విచారం వ్యక్తం చేస్తున్నామంటూ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టింది. దేశంలో ఇంధన రంగంలో గడ్డు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రధాని శుక్రవారం యూఏఈలో పర్యటించారు. భారత్‌లో వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలకు సంబంధించి యూఏఈతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశీయ ఇంధన రంగ భద్రత, ధరల హెచ్చుతగ్గుల నుంచి రక్షణ దిశగా ఈ ఒప్పందం కుదిరింది.

### తన అభిప్రాయాలను వక్రీకకరించిన

# ఓ వర్గం మీడియా

## బొద్దింక వ్యాఖ్యలపై సుప్రీం సిజెఐ వివరణ

**న్యూఢిల్లీ:** ఎలాంటి ఉద్యోగాలు లభించని, ఏ వృత్తిని చేపట్టని కొందరు యువత బొద్దింకల్లా తయారవుతున్నారని, వ్యవస్థపై దాడి చేస్తున్నారంటూ తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంతో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వివరణ ఇచ్చారు. తన నోటి మాటలను ఒక వర్గం మీడియా వక్రీకరించిందని, దేశంలోని యువతను విమర్శించినట్టుగా తప్పుగా చిత్రీకరించిందని అన్నారు. తాను దేశ యువతను విమర్శించాననడం పూర్తిగా నిరాధారమని అన్నారు.'ఏ మాత్రం హేతుబద్ధత లేని ఒక కేసు శుక్రవారంనాడు విచారణకు వచ్చినప్పుడు నేను వ్యక్తం చేసిన అభిప్రాయాలను ఒక వర్గం మీడియా తప్పుగా ప్రచారం చేసింది. కొందరు బోగస్ డిగ్రీలతో లీగల్ వృత్తిలోకి వస్తున్న వారిని ఉద్దేశించి మాత్రమే నేను విమర్శించాను. అలాంటి వ్యక్తులు మీడియాలోకి, సామాజిక మాధ్యమాల్లోకి, ఇతర నోబెల్ ప్రొపెషనల్‌లో చొరబడుతున్నారు. అలాంటి వారిని పరాన్నజీవులుగా అభివర్ణించారు. అంతే కానీ దేశంలోని యువతను విమర్శించినట్టు మీడియాలో కథనాలు రావడం పూర్తిగా నిరాధారం. ఆ వార్తలు నాకు బాధ కలిగించాయి' అని సీజేఐ సూర్యకాంత్ వివరణ ఇచ్చారు. దేశంలోని యువతను చూసి తాను గర్విస్తుంటానని, అభివృద్ధి చెందిన భారతదేశానికి యువత మూలస్తంభాలని సీజేఐ ప్రశంసించారు. ÷ఖనియర్ అడ్వకేట్ హోదా కోరుతూ ఒక న్యాయవాది వేసిన పిటిషన్ సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం ముందుకు శుక్రవారంనాడు విచారణకు వచ్చిన సందర్భంగా పిటిషనర్‌పై సీజేఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే కొంతమంది పరాన్నజీవులు సమాజంలో ఉన్నారని, వారితో మీరు చేతులు కలుపుతారా అని ప్రస్నించారు. ఫేస్‌బుక్‌లో పిటిషన్ వాడిన భాషను కూడా సీజేఐ ప్రస్తావించారు. ప్రపంచంలో అందరికీ సీనియర్ అడ్వకేట్ హోదా లభించినా, మీకు మాత్రం ఆ అర్హత దక్కదన్నారు. ఢిల్లీ హైకోర్టు మీకు ఆ హోదా ఇచ్చానా, వృత్తిపరమైన ప్రవర్తనచూసి తాము దానిని రద్దు చేస్తామన్నారు. చాలామంది న్యాయవాదుల డిగ్రీల ప్రామాణికతపై తమకు అనుమానాలవు కూడా ఉన్నాయని చెప్పారు. ఈ విషయంలో సీబీఐ విచారణ కోరాలని భావిస్తున్నట్టు చెప్పారు. దీంతో పిటిషనర్ క్షమాపణ చెప్పుకున్నారు. కేసు ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని కోరారు. అందుకు న్యాయస్థానం అనుమతించింది.

# తమిళనాడు ముఖ్యమంత్రి, మంత్రులకు శాఖల కేటాయింపు

## విజయ్ వద్దే హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్

## సెంగొట్టియన్‌కు ఆర్థిక శాఖ కేటాయింపు

**చెన్నై:** ముఖ్యమంత్రి విజయ్ సిఫార్సు మేరకు మంత్రులకు శాఖలను కేటాయిస్తూ లోక్ భవన్ శనివారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ముఖ్యమంత్రి విజయ్ తన వద్ద హోం, పోలీస్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, మహిళా సంక్షేమం, యువజన సంక్షేమం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ వాటర్ సప్లై శాఖలను ఉంచుకున్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, పేదరిక నిర్మూలన, నీటిపారుదల ప్రాజెక్టుల శాఖలను ఎన్.ఆనంద్‌కు అప్పగించారు. పబ్లిక్ వర్క్స్, హైవేస్, మైనర్ పోర్ట్స్, క్రీడల అభివృద్ధి శాఖలను ఆదవ్ అర్జునకు కేటాయించారు. ఆరోగ్యం, మెడికల్ ఎడ్యుకేషన్, ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖలను డాక్టర్ కె.జి.అరుణ్ రాజ్‌కు అప్పగించారు. ఫైనాన్స్, పెన్షన్స్ శాఖల బాధ్యతలను కె.ఎ.సెంగొట్టయ్యన్‌కు అప్పగించగా.. ఫుడ్ అండ్ సివిల్ సప్లైస్, కన్స్యూమర్ ప్రొటెక్షన్, ప్రైస్ కంట్రోల్ శాఖలను పి.వెంకటరమణన్‌కు కేటాయించారు. విద్యుత్, న్యాయ, జైళ్లు, అవినీతి నిరోధక శాఖలను ఆర్.నిర్మల్ కుమార్‌కి కేటాయించారు. స్కూల్ ఎడ్యుకేషన్, తమిళ అభివృద్ధి, సమాచార ప్రచార శాఖ, కల్చర్, ఫిల్మ్ టెక్నాలజీ శాఖలను రాజ్ మోహన్‌కు అప్పగించారు. మైన్స్ అండ్ మినరల్స్ శాఖను డాక్టర్ టి.కె.ప్రభుకు కేటాయించగా.. ఇండస్ట్రీస్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ శాఖల బాధ్యతలను సెల్వి ఎస్.కీర్తనకు అప్పగించారు. ఆయా శాఖలను మంత్రులకు కేటాయిస్తూ లోక్ భవన్ ప్రకటన విడుదల చేసింది. తమిళగ వెట్రి కళగం అధినేత జోసెఫ్ విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా మే 10న ప్రమాణ స్వీకారం చేశారు. చెన్నై జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో విజయ్‌తో పాటు మరో తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఎన్.ఆనంద్, ఆదవ్ అర్జున, అరుణ్ రాజ్, సెంగొట్టయ్యన్, బి.వెంకటరమణన్, నిర్మల్ కుమార్, రాజ్ మోహన్, డాక్టర్ టి.కె.ప్రభు, ఎస్.కీర్తనలకు మంత్రివర్గంలో చోటు కల్పించారు.

# రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ కోర్టులో ఊరట

## ఈడీ స్వతంత్రంగా పనిచేయడం లేదన్న వాద్రా

**న్యూఢిల్లీ :** షికోపూర్ భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఊరట లభించింది. ఈ కేసు విచారణలో భాగంగా కోర్టు ఆయనకు ఒక ష్యూరిటీతో బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా రాబర్ట్ వాద్రా మీడియాతో మాట్లాడుతూ దేశ న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీరుపై వాద్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈడీ స్వతంత్రంగా పనిచేయడం లేదు. ఆ సంస్థను కేంద్ర ప్రభుత్వమే వెనుక ఉండి నడిపిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకే అది ముందుకు సాగుతోంది. ఈడీ వైపు నుంచి జరుగుతున్నది ఎంతమాత్రం న్యాయం కాదు. కేసు దర్యాప్తునకు నేను ఎప్పుడూ సహకరిస్తూనే ఉంటా. నేను ఎక్కడికీ పారిపోలేదు, ఇక్కడే ఉన్నాను. నా వద్ద దాచడానికి ఏమీ లేదు. దర్యాప్తు సంస్థలు అడిగే అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా. ఎలాంటి పరిస్థితులనైనా, చట్టపరమైన సవాళ్లనైనా ఎదుర్కొనే పూర్తి సామర్థ్యం నాకు ఉంది'.. అని రాబర్ట్ వాద్రా అన్నారు.

# గుజరాత్‌పై కేకేఆర్ అద్భుత విజయం

## దంచికొట్టిన అలెన్, రఘువంశీ

## గిల్, బట్లర్ పోరాటం వృథా



కోల్‌కతా: ఆరంభంలో వరుస పరాజయాలతో నిరాశపరిచి తర్వాత వేగం పుంజుకున్న కోల్‌కతా నైట్ రైడర్స్ మరో అద్భుత విజయం అందుకుంది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో పంజా విసిరింది. వరుసగా ఐదు విజయాలతో ప్లేఆఫ్స్‌కు గెలుపు దూరంలో ఉన్న గుజరాత్ టైటాన్స్‌కు షాకిచ్చింది. సొంతగడ్డపై తమ వందో మ్యాచ్‌లో ఫిన్ అలెన్ (35 బంతుల్లో 4 ఫోర్లు, 10 సిక్సర్లతో 93), అంగ్‌క్రిష్ రఘువంశీ (44 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 82 నాటౌట్) విధ్వంసం సృష్టించడంతో ఈడెన్ గార్డెన్స్‌లో శనివారం రాత్రి జరిగిన హై స్కోరింగ్ పోరులో కేకేఆర్ 29రన్స్ తేడాతో విజయం సాధించింది. తొలుత కేకేఆర్ నిర్ణీత 20 ఓవర్లలో 247/2 భారీ స్కోరు చేసింది. కామెరాన్ గ్రీన్ (28 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 52 నాటౌట్) కూడా రాణించాడు. అనంతరం జీటీ ఓవర్లన్నీ ఆడి 218/4 స్కోరు చేసి ఓడింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (49 బంతుల్లో 5 ఫోర్లు, 7 సిక్సర్లతో 85), జోస్ బట్లర్ (57), సుదర్శన్ (53 నాటౌట్)పోరాడినా ఫలితం లేకపోయింది. రెండు కీలక వికెట్లు తీసిన సునీల్ నరైన్ (2/29)కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

### ఆకాశమే హద్దుగా...

అలెన్, రఘువంశీ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో కేకేఆర్ భారీ స్కోరు చేసింది. పేలవ బౌలింగ్‌కు తోడు చెత్త ఫీల్డింగ్‌తో ఏకంగా నాలుగు క్యాచ్‌లు జారవిడిచిన గుజరాత్ మూల్యం చెల్లించుకుంది. 14, 33 పరుగుల వ్యక్తిగత స్కోర్ల వద్ద క్యాచ్ డ్రాప్‌ల నుంచి బయటపడ్డ అలెన్ జీటీ బౌలర్ల భరతం పట్టాడు. సిరాజ్ వేసిన మూడో ఓవర్లో రెండు ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన అలెన్.. రబాడ బౌలింగ్‌లో రెండు భారీ సిక్సర్లతో టాప్ గేర్ అందుకున్నాడు. కెప్టెన్ రహానే (14)ను సిరాజ్ క్లీన్ బౌల్డ్ చేసి జీటీకి తొలి బ్రేక్ ఇచ్చినా.. వన్‌డౌన్‌లో రఘువంశీ రాకతో నిప్పుకు గాలి తోడైనట్టైంది. రషీద్ వేసిన ఏడో ఓవర్లో వరుసగా 6,6,4 కొట్టిన అలెన్ 21 బంతుల్లోనే ఫిఫ్టీ అందుకోగా.. ఇంకోఎండ్‌లో రఘు సైతం భారీ షాట్లు కొట్టడంతో 9 ఓవర్లకే స్కోరు వంద దాటింది. అర్షద్ ఖాన్ వేసిన 11 ఓవర్లో మూడ సిక్సర్లు, ఫోర్ కొట్టిన ఫిన్ శతకం చేసేలా కనిపించాడు. కానీ, సాయి కిశోర్ బౌలింగ్‌లో భారీ షాట్‌కు యత్నించి రషీద్‌కు క్యాచ్ ఇవ్వడంతో రెండో వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఈ దశలో రఘుకు గ్రీన్ తోడవడంతో జీటీ బౌలర్లు తలలు పట్టుకున్నారు. కిశోర్ బౌలింగ్‌లో 6,4, 6.. రషీద్ ఓవర్లో 4,6తో గ్రీన్ మెరుపులు మెరిపించగా.. హోల్డర్ బౌలింగ్‌లో ఫోర్ కొట్టిన రఘు ఐపీఎల్‌లో ఏడో ఫిఫ్టీ పూర్తి చేశాడు. సిరాజ్ వేసిన 19వ ఓవర్లో రఘు 6, 6, 6, 4 సహా 25 పరుగులు పిండుకున్నాడు. ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు అజేయంగా 108 పరుగులు జోడించడంతో కేకేఆర్ భారీస్కోరుచేసింది.

### టైటాన్స్ పోరాడినా..

కెప్టెన్ గిల్ ఖతర్నాక్ షాట్లతో చెలరేగినా లక్ష్యం మరీ పెద్దది కావడంతో టైటాన్స్ ఓటమి తప్పలేదు. భారీ లక్ష్య ఛేదనలో ఆ జట్టు దూకుడుగా ఆడింది. ఐదు ఫోర్లు, ఓ సిక్స్ బాదిన ఓపెనర్ సుదర్శన్ మూడో ఓవర్లో కార్తీక్ త్యాగి ఆఖరి బంతి మోచేతికి బలంగా తగలడంతో రిటైర్డ్ హర్ట్‌గా డగౌట్ చేరాడు. ఐదో ఓవర్లో బౌలింగ్‌కు దిగిన నరైన్ తన తొలి బంతికే నిశాంత్ సంధు (1)ను ఔట్ చేసి కేకేఆర్ శిబిరంలో జోష్ నింపాడు. ఈ దశలో బట్లర్ తోడుగా గిల్ దూకుడుగా ఆడాడు. నరైన్ బౌలింగ్‌లో 6,6.. అనుకూల్ రాయ్ బౌలింగ్‌లో 6,6,4 బాదిన అతను పది ఓవర్లకే స్కోరు వంద దాటించడంతో పాటు 33 బంతుల్లో హాఫ్ సెంచరీ అందుకున్నాడు. 14వ ఓవర్లో చక్రవర్తిని టార్గెట్ చేసి రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 22 పరుగులు రాబట్టాడు. చివరి ఐదు ఓవర్లలో 85 రన్స్ అవసరం అవగా.. అప్పటిదాకా నెమ్మదిగా ఆడిన బట్లర్.. త్యాగి బౌలింగ్‌లో 4,6తో వేగం పెంచి అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. కానీ, 17వ ఓవర్లో అనుకూల్ పట్టిన క్యాచ్‌తో గిల్‌ను ఔట్ చేసిన నరైన్ ఐదే రన్స్ ఇచ్చి జీటీ వేగానికి కళ్లెం వేశాడు. ఈ దశలో మళ్లీ క్రీజులోకి వచ్చిన సుదర్శన్, బట్లర్ చెరో ఫోర్, సిక్స్‌తో ఆశలు రేపారు. కానీ, 19వ ఓవర్లో బట్లర్‌ను ఔట్ చేసి 5 రన్స్ మాత్రమే ఇచ్చిన సౌరభ్ దూబే కేకేఆర్ విజయం ఖాయం చేశాడు.

### సంక్షిప్త స్కోర్లు

కోల్‌కతా: 20 ఓవర్లలో 247/2 (అలెన్ 93, రఘువంశీ 82, గ్రీన్ 52లి, సిరాజ్ 1/50) గుజరాత్: 20 ఓవర్లలో 218/4 (గిల్ 87, బట్లర్ 57, నరైన్ 2/29)



# టీమిండియాలో భారీ మార్పులు..

2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఘన విజయం తర్వాత భారత వన్డే జట్టు ప్రదర్శన గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో పరాజయం, ఆ తర్వాత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాభవం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో అఫ్గానిస్తాన్‌తో జరిగే వన్డే సిరీస్ భారత్‌కు అత్యంత కీలకంగా మారింది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, సెలెక్టర్లు ఇప్పటి నుంచే జట్టును పునర్నిర్మించే పనిలో పడ్డారు. దీనిలో భాగంగానే దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణించిన యువ ఆటగాళ్లకు ఈ సిరీస్‌లో పెద్దపీట వేయబోతున్నట్లు సమాచారం. కర్ణాటకకు చెందిన ఎడమచేతి వాటం బ్యాటర్ దేవదత్ పడిక్కల్ గత కొంతకాలంగా సెలెక్టర్ల తలుపు తడుతూనే ఉన్నాడు. విజయ్ హజారే ట్రోఫీలో అతడు సృష్టించిన పరుగుల సునామీ చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే.కేవలం తొమ్మిది మ్యాచ్‌ల్లోనే 90కి పైగా సగటుతో 725 పరుగులు సాధించి, టోర్నీలోనే రెండో అత్యధిక రన్ స్కోరర్‌గా నిలిచాడు. ఇందులో నాలుగు భారీ సెంచరీలు ఉండటం విశేషం. ప్రస్తుతం టీమిండియా రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ హ్యామ్‌స్ట్రింగ్ గాయంతో పూర్తిగా ఫిట్‌గా లేకపోవడంతో, అఫ్గాన్ సిరీస్‌లో శుభ్‌మన్ గిల్‌తో కలిసి పడిక్కల్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.భారత జట్టులోకి మరో వికెట్ కీపర్ బ్యాటర్‌ను తీసుకోవాలని యాజమాన్యం గట్టిగా భావిస్తోంది. ఈ రేసులో అందరికంటే ముందు వరుసలో ఉన్నాడు ఇషాన్ కిషన్. దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వేట సాగించిన కిషన్, 2026 టీ20 ప్రపంచకప్ విజయంలోనూ కీలక పాత్ర పోషించాడు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లపై విరుచుకుపడుతూ వేగంగా పరుగులు రాబట్టడంలో కిషన్ దిట్ట. కేఎల్ రాహుల్ మొదటి ఛాయిస్ కీపర్‌గా ఉన్నప్పటికీ, కిషన్ రూపంలో ఒక ఎడమచేతి వాటం దూకుడున్న బ్యాటర్ జట్టుకు అదనపు బలాన్ని ఇస్తాడనడంలో సందేహం లేదు. వన్డేల్లో 27 మ్యాచ్‌లాడి 42 సగటుతో ఒక డబుల్ సెంచరీతో సహా 933 పరుగులు చేసిన ఘనమైన రికార్డు ఇషాన్ సొంతం. ఐపీఎల్ 2026 కనుగొన్న అద్భుత వజ్రం ప్రిన్స్ యాదవ్. తన బుల్లెట్ లాంటి వేగంతో ప్రత్యర్థి బ్యాటర్లను బెంబేలెత్తించడం ఇతడి శైలి. ఈ సీజన్‌లో విరాట్ కోహ్లీని అవుట్ చేసిన తీరే ఇతడి నైపుణ్యానికి నిదర్శనం. కేవలం ఐపీఎల్‌లోనే కాకుండా విజయ్ హజారే ట్రోఫీలోనూ ప్రిన్స్ సత్తా చాటాడు.టోర్నీలో 18 వికెట్లతో టాప్-5 బౌలర్లలో ఒకడిగా నిలిచాడు. 2027 ప్రపంచకప్ దక్షిణాఫ్రికాలోని బౌన్సీ పిచ్‌లపై జరగనుంది. అలాంటి పిచ్‌లపై ప్రత్యర్థులను భయపెట్టే ఎక్స్‌ప్రెస్ పేసర్ భారత్‌కు ఎంతో అవసరం. ఆ లోటును భర్తీ చేయగల సత్తా ప్రిన్స్ యాదవ్‌కు ఉంది. అందుకే అతడిని వన్డే జట్టులోకి తీసుకురావాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. అఫ్గానిస్తాన్‌తో జరిగే వన్డే సిరీస్ టీమిండియా భవిష్యత్తుకు దిక్సూచి లాంటిది. పాత తప్పులను సరిదిద్దుకుంటూ, యువ రక్తాన్ని జట్టులోకి ఆహ్వానించి కొత్త శకానికి నాంది పలకడానికి ఇది సరైన సమయం. దేవదత్ పడిక్కల్ క్లాస్ బ్యాటింగ్, ఇషాన్ కిషన్ మాస్ పవర్, ప్రిన్స్ యాదవ్ బుల్లెట్ వేగం తోడైతే భారత జట్టు వన్డేల్లో మళ్లీ నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. సెలెక్టర్ల సాహసోపేత నిర్ణయాలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయో చూడాలి.

# రిషబ్ పంత్‌కు బీసీసీఐ బిగ్ షాక్!

సీఎస్కేతో జరిగిన కీలక మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ అద్భుత విజయాన్ని సాధించింది. లక్నో జట్టు గెలిచినా ఆ జట్టు కెప్టెన్ రిషబ్ పంత్ కు బీసీసీఐ బిగ్ షాక్ ఇచ్చింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు గానూ పంత్‌పై బీసీసీఐ క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. లక్నోలోని ఎకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ రిషబ్ పంత్ కు రూ.12 లక్షల జరిమానా విధించింది. ఐపీఎల్ ప్రవర్తన నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం కనీస ఓవర్ రేట్ నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకు రిషబ్ పంత్‌ను దోషిగా తేల్చారు. లక్నో సూపర్ జెయింట్స్ జట్టుకు ఈ సీజన్లో ఇది మొదటి తప్పిదం కావడంతో కేవలం కెప్టెన్‌కు మాత్రమే రూ. 12 లక్షల జరిమానాతో సరిపెట్టారు. ఒకవేళ ఇదే తప్పు మళ్లీ పునరావృతమైతే జరిమానా మొత్తం పెరగడంతో పాటు జట్టులోని మిగిలిన సభ్యులకు కూడా మ్యాచ్ ఫీజులో కోత పడే అవకాశం ఉంటుంది. ఈ సీజన్ ముగియడానికి మరో 15 రోజులు మాత్రమే ఉండటంతో మ్యాచ్‌ల తీవ్రత దృష్ట్యా బౌలింగ్ సమయాన్ని నియంత్రించడం కెప్టెన్లకు పెద్ద సవాలుగా మారింది.ఈ మ్యాచ్‌లో లక్నో జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించడంపై కెప్టెన్ రిషబ్ పంత్ సంతోషం వ్యక్తం చేశాడు. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రెజెంటేషన్‌లో రిషబ్ పంత్ మాట్లాడుతూ.. ఈ విజయం జట్టు నైతిక స్థైర్యాన్ని ఎంతగానో పెంచిందని అన్నాడు. ఈ సీజన్ ఎలా ముగిసినా సరే, లక్నో జట్టుగా గర్వపడేలా ఆడటమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. అలాగే జట్టులోని ఆటగాళ్లందరికీ స్పష్టమైన బాధ్యతలు అప్పగించడం వల్లే ఈ విజయం సాధ్యమైందని, తీవ్రమైన ఒత్తిడి ఉండే ఇలాంటి టోర్నమెంట్లలో వ్యూహాలను చాలా సరళంగా ఉంచుకోవడం ముఖ్యమని పంత్ పేర్కొన్నాడు. ఇదే క్రమంలో లక్నో పేసర్ ఆకాష్ సింగ్ ప్రదర్శనను రిషబ్ పంత్ ప్రత్యేకంగా అభినందించాడు. ఆకాష్ సింగ్ ప్లాన్స్ మార్చకుండా క్రమశిక్షణతో బౌలింగ్ చేశాడని, అతని కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని కొనియాడాడు. అలాగే టాక్టికల్ నిర్ణయాల్లో భాగంగా ఇద్దరు విదేశీ ఆటగాళ్లను ఓపెనర్లుగా పంపి, నికోలస్ పూరన్‌ను వన్ డౌన్‌లో (నంబర్ 3) బ్యాటింగ్‌కు పంపాలనే వ్యూహం కూడా తమకు బాగా కలిసివచ్చిందని రిషభ్ పంత్ వివరించాడు.

# కెనడా క్రికెట్ బోర్డుకు ఐసీసీ ఊహించని షాక్




కెనడా క్రికెట్ బోర్డుకు ఐసీసీ ఊహించని షాక్ ఇచ్చింది. ఆ దేశ క్రికెట్ బోర్డులో చోటుచేసకున్న పరిపాలనా లోపాలు, అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఐసీసీ కఠిన నిర్ణయం తీసుకుంది. క్రికెట్ కెనడాకు అందాల్సిన నిధులను రాబోయే 6 నెలల పాటు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత కొంతకాలంగా కెనడా క్రికెట్ పాలనలో జరుగుతున్న అంతర్గత వివాదాలు, ఐసీసీ నిబంధనల ఉల్లంఘనలపై జరిపిన విచారణల అనంతరం ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి ఈ నిర్ణయం వల్ల కెనడా క్రికెట్ మ్యాచ్ లపై తక్షణ ప్రభావం పడకపోయినప్పటికీ.. ఆర్థికంగా ఆ బోర్డు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.కెనడా క్రికెట్ బోర్డు పూర్తిగా ఐసీసీ ఇచ్చే నిధులపైనే ఆధారపడి నడుస్తోంది. కెనడా క్రికెట్ బోర్డు వార్షికాదాయంలో దాదాపు 63 శాతం వాటా నేరుగా ఐసీసీ ఫండింగ్ ద్వారానే వస్తుంది. 2024 ఆర్థిక సంవత్సర లెక్కల ప్రకారం బోర్డు మొత్తం రాబడి సుమారు 5.7 మిలియన్ కెనడియన్ డాలర్లు (దాదాపు రూ. 40 కోట్లు) కాగా.. అందులో ఐసీసీ నుంచే ఏకంగా 3.6 మిలియన్ కెనడియన్ డాలర్లు వచ్చాయి. ఇప్పుడు ఈ నిధులన్నీ ఆరు నెలల పాటు ఆగిపోనుండటంతో బోర్డు నిర్వహణ కెనడాకు అత్యంత భారంగా మారనుంది.నిధుల నిలిపివేతకు గల ఖచ్చితమైన కారణాలను ఐసీసీ అధికారికంగా ప్రకటించనప్పటికీ.. కెనడాకు చెందిన 'ద ఫిఫ్త్ ఎస్టేట్' అనే ఇన్వెస్టిగేటివ్ ప్రోగ్రామ్ బయటపెట్టిన నిజాలు దీనికి కారణమని తెలుస్తోంది. బోర్డులో ఆర్థిక అవకతవకలు, ఐసీసీ పాలసీల ఉల్లంఘనలపై ఈ ప్రోగ్రామ్ ఒక డాక్యుమెంటరీని విడుదల చేసింది. అంతేకాకుండా గత టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌తో కెనడా ఆడిన మ్యాచ్‌పై ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ (ఏసీయూ) ప్రస్తుతం దర్యాప్తు చేస్తోంది. మరోవైపు, కెనడా మాజీ కోచ్ ఖుర్రం చౌహాన్ మాట్లాడిన ఒక ఆడియో లీక్ అవ్వడం కూడా బోర్డును మరింత ఇరకాటంలో పడేసింది. జాతీయ జట్టు సెలక్షన్‌లో కొందరు నిర్దిష్ట ఆటగాళ్లనే ఎంపిక చేయాలంటూ బోర్డు సీనియర్ అధికారులు తనపై ఒత్తిడి తెచ్చారని, మ్యాచ్ ఫిక్సింగ్ ప్రయత్నాలు కూడా జరిగాయని ఆ ఆడియోలో ఆయన ఆరోపించడం సంచలనంగా మారింది. ఈ వివాదాలపై కెనడా క్రికెట్ మీడియా మేనేజర్ జిమ్మీ శర్మ స్పందిస్తూ.. ప్రస్తుత బోర్డుకు ఇవన్నీ గత పాలకులు చేసిన తప్పుల వల్ల వారసత్వంగా వచ్చాయని వెల్లడించారు. బోర్డులో ఉన్న పరిపాలనా లోపాలు, ఆర్థిక నియంత్రణ లోపాలను సరిదిద్దడానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఐసీసీ గానీ, కెనడా క్రికెట్ బోర్డు గానీ ఈ సస్పెన్షన్‌పై ఇంకా పూర్తి స్థాయి అధికారిక ప్రకటనలు విడుదల చేయాల్సి ఉంది.

# ఐపీఎల్‌లో ట్రెండింగ్‌లో నోట్ సంబరాలు




మొన్న రఘు శర్మ, నిన్న ఉర్విల్ పటేల్. ఈ ఐపీఎల్‌లో నోట్ సంబరాలు చేసుకొని ట్రెండింగ్‌లో నిలిచిన క్రికెటర్లు వీళ్లు. తాజాగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్ ఆకాశ్ మహారాజ్ సింగ్ కూడా అదే ట్రెండ్ ఫాలో అవుతూ మైదానంలో అలాంటి సెలబ్రేషన్నే చేసుకొని వైరల్ అయ్యాడు. అయితే ఐపీఎల్‌లో ఇలా చిటీ రాసుకొచ్చి కెమెరాకు చూపిస్తూ సెలబ్రేషన్స్ చేసుకోవడంపై సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ డెల్ స్టెయిన్ స్పందించాడు. ఐపీఎల్‌లో ఈ రకమైన సెలబ్రేషన్స్‌కు కాలం చెల్లిందని అభిప్రాయపడ్డాడు.తాజాగా ఎకానా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యువ ఆటగాడు ఆకాశ్ మహారాజ్ సింగ్ అదరగొట్టాడు. మూడు వికెట్లు తీసి చెన్నై టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. అతడు వరుసగా గైక్వాడ్, శాంసన్, ఉర్విల్ పటేల్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. తొలుత 3.4 ఓవర్ వద్ద గైక్వాడ్‌ను క్యాచౌట్ చేయగానే తన జేబులో నుంచి ఓ కాగితం చీటీని బయటకు తీసి కెమెరాకు చూపించాడు. ఇది వైరల్‌గా మారింది. అయితే ఇటీవల కాలంలో ఐపీఎల్‌లో యంగ్ ప్లేయర్లు చేసుకుంటున్న నోట్ సంబరాలపై స్టెయిన్ స్పందించాడు.ఆ కాగితాలను పక్కన పెట్టేయాల్సిన సమయం వచ్చిందని స్టెయిన్ అన్నాడు. ఆ నోట్స్ సంబరాలు ఇప్పుడు ట్రెండింగ్‌లో లేవని, క్రికెట్‌లో ఈ సెలబ్రేషన్ ఏనాడు ఫ్యాషన్ కాదని పేర్కొన్నాడు. ఈ మేరకు ఓ ట్వీట్ షేర్ చేశాడు. 'ఇకపై ఆ కాగితాలను (చిటీలను) పక్కన పెట్టేసే సమయం వచ్చింది. ఇప్పుడు ఎక్కడ కూడా అలాంటి సెలబ్రేషన్ ట్రెండింగ్‌లో లేదు. నిజం చెప్పాలంటే, క్రికెట్‌లో అసలు అది ట్రెండింగ్ కూడా కాదు' అని పోస్ట్‌లో రాసుకొచ్చాడు. దీనిపై నెటిజన్లు కూడా పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. 'ఒకరిద్దరు అయితే ఫర్వాలేదు, కానీ ప్రతీ ఒక్కరూ ఇలా సంబరాలు చేసుకుంటే స్పెషల్‌గా ఏమీ అనిపించడం లేదు' అని ఓ యూజర్ కామెంట్ చేశారు.అయితే తాను కెమెరాకు చూపించిన నోట్‌లో ఏముందో ఆకాశ్ మ్యాచ్ అనంతరం వెల్లడించాడు. అది తనకు మోటివేషన్ కోసమే జేబులో ఉంచుకున్నట్లు చెప్పాడు. 'ఆ నోట్‌లో అక్కి ఆన్ ఫైర్! టీ20 క్రికెట్‌లో వికెట్లు తీయడం ఎలాగో ఆకాశ్‌కు బాగా తెలుసు! అని రాసి ఉంది. అది నాకు ప్రేరణ ఇస్తుంది. కేవలం ఓ మోటివేషన్ కోసమే అది జేబులో ఉంచుకుంటా. అంతకంటే పెద్ద స్టోరీ ఏమీ లేదు. ఆడుతున్నపుడు నాకు స్ఫూర్తిని కలిగించడానికే నేను దాన్ని చూపెట్టాను' అని అకాశ్ చెప్పాడు. కాగా, ఈ మ్యాచ్‌లో ఆకాశ్ 4 ఓవర్లు వేసి 26 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు.గతేడాది సన్‌రైజర్స్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఈ రకమైన నోట్ సంబరాలను ప్రారంభించాడు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో సెంచరీ బాదిన తర్వాత ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ కోసం ఓ నోట్ రాసుకొచ్చి దాన్ని కెమెరాకు చూపించాడు. అలా మొదలైన ఈ ట్రెండ్‌ను ఈ సీజన్‌లో ముంబయి బౌలర్ రఘు శర్మ, సీఎస్కే బ్యాటర్ ఉర్విల్ పటేల్, తాజాగా ఆకాశ్ కొనసాగించారన్నమాట!

మానేరు **జనత**
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
ఆదివారం 17 మే 2026




# నేటి యువతకు లవ్, రిలేషన్ అంటే ఏమిటో తెలియదు: తమన్నా

హీరోయిన్ తమన్నా భాటియా నేటితరం యువతకు ప్రేమ, బంధాల (రిలేషన్స్) పై సరికొత్త లెక్చర్లు ఇస్తూ వార్తల్లో నిలిచారు. ముఖ్యంగా నటుడు విజయ్ వర్మతో బ్రేకప్ అయినప్పటి నుంచి ఆమె సమయం దొరికినప్పుడల్లా ప్రేమకు సంబంధించిన తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకుంటున్నారు. అసలు వీరిద్దరి బంధం పెళ్లి వరకు వెళుతుందని అందరూ అనుకుంటే, ఎందుకు సడన్‌గా విడిపోయింది, తమన్నాను విజయ్ వర్మ ఏమైనా అనుమానించారా లేదా మరేదైనా కారణం ఉందా అనే విషయాలను ఇప్పటివరకు ఈ జంట అధికారికంగా బయటపెట్టనప్పటికీ, తాజాగా తమన్నా చేసిన వ్యాఖ్యలు వారి బ్రేకప్ కారణాలపై పలు అనుమానాలకు తావిచ్చేలా ఉన్నాయి. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ అనేది ఒక్కసారి మాత్రమే కాదు, పలుమార్లు పుట్టవచ్చని మరియు అదే నిజమైన ప్రేమ అని వ్యాఖ్యానించారు. నేటితరం యువతకు లవ్, రిలేషన్ అంటే సరిగ్గా తెలియక గందరగోళానికి గురవుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తిని నిజంగా ప్రేమించాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, మన భావాలను వారిపై బలవంతంగా రుద్దడం ద్వారా ప్రేమను నిరూపించుకోలేమని స్పష్టం చేశారు. ప్రేమ అనేది కేవలం ఒకే ఒకసారి కలిగే అనుభవం కాదని, అది జీవితంలో అనేకసార్లు జరగాల్సిన ప్రేరణ అని పేర్కొంటూ, ఇది బహిరంగంగా హావభావాల ద్వారా వ్యక్తపరిచేది కాదని, అంతర్లీనంగా పుట్టే ఒక భావోద్వేగమని తమన్నా వివరించారు. ఆమె చెబుతున్న ఈ మాటలను బట్టి చూస్తే, ప్రేమ విషయంలో ఆమె వ్యక్తిగత స్వేచ్ఛకు ఎంతగా ప్రాధాన్యత ఇస్తుందో అర్థమవుతోంది.

# అనుపమ మరీచిక ట్రైలర్ విడుదల




టాలీవుడ్ యంగ్ హీరో విరాజ్ అశ్విన్, స్టార్ హీరోయిన్లు రెజీనా కాసాండ్రా, అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మరీచిక'. సతీష్ కాసెట్టి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా చిలకా ప్రొడక్షన్ బ్యానర్‌పై రాజీవ్ చిలకా, మేఘన చిలకా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సస్పెన్స్, లవ్ అండ్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా అధికారిక ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. ఈ సినిమా ట్రైలర్ చూస్తుంటే.. సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రానికి 'మ్యూజికల్ మాస్ట్రో' ఇళయరాజా సంగీతం అందించడం విశేషం. ఆయన అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అద్భుతమైన కథాంశంతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా మే 29న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

# పెద్ది ట్రైలర్.. జస్ట్ వావ్ అంటూ చిరు లీక్స్

## ముందే ట్రైలర్ చూసి ..బృందాన్ని ప్రశంసించిన చిరంజీవి



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'పై అభిమానుల్లో భారీగా అంచనాలు ఉన్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం మే 18న విడుదల కాబోతున్న ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి ముందే వీక్షించారు. ట్రైలర్ చూసిన అనంతరం ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, చిత్ర యూనిట్‌పై ప్రశంసల జల్లు కురిపించారు. ట్రైలర్ గురించి చిరంజీవి ట్వీట్ చేస్తూ.. ఇప్పుడే పెద్ది ట్రైలర్ చూశాను, జస్ట్ వావ్ అంతే! 3 నిమిషాల పాటు సాగిన ఈ ట్రైలర్ ప్యూర్ పవర్ ప్యాక్డ్‌గా ఉంది. చరణ్, బుచ్చిబాబు, రెహమాన్.. ఇలా ఒక్కొక్కరు తమ బెస్ట్ అవుట్‌పుట్ ఇచ్చారు. అందరూ కలిసి బాక్సాఫీస్‌ను రఫ్ఫాడించేశారు. ఈ సినిమా గురించి మనం ఎంత ఊహించుకున్నా, ఈ ట్రైలర్ దాన్ని మించి ఉంటుంది. ఇందులో ఎమోషన్, ఎలివేషన్, మ్యాడ్నెస్ అన్నీ నెక్స్ట్ లెవెల్‌లో ఉన్నాయి అని చిరు కొనియాడారు. ఎప్పటికప్పుడు తన సినిమాలకు లేదా చరణ్ సినిమాలకు సంబంధించిన ఆసక్తికర విషయాలను లీక్ చేస్తూ అభిమానులను అలరించే చిరంజీవి, ఈసారి కూడా తన అలవాటును రిపీట్ చేశారు. 'చాలా రోజులయ్యింది మీకు 'చిరు లీక్స్' ఇచ్చి' అంటూ సరదాగా వ్యాఖ్యానిస్తూ, పెద్ది ట్రైలర్‌లోని ఒక పవర్‌ఫుల్ డైలాగ్‌ను ఆయన లీక్ చేశారు. 'మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు? నేను పోరాడాను సారు.. అంటూ ట్రైలర్‌లోని ఈ డైలాగ్ ఎంతో అద్భుతంగా ఉందంటూ మెగాస్టార్ ప్రశంసించారు. ఈ క్రమంలోనే దర్శకుడు బుచ్చిబాబుకు క్షమాపణలు చెబుతూ.. 'సారీ బుచ్చిబాబు.. ట్రైలర్ చూశాక కంట్రోల్ తప్పి లీక్ చేయాల్సి వచ్చింది' అంటూ చిరంజీవి చమత్కరించారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ట్రైలర్ మే 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. మెగాస్టార్ స్వయంగా ఇచ్చిన ఈ రివ్యూతో మెగా అభిమానుల్లో, సినీ ప్రేక్షకుల్లో 'పెద్ది' ట్రైలర్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి.



# విడాకులు వచ్చే వరకు నటించను

## తనపై ట్రోల్స్ రావడంపై కన్నీటి పర్యంత అయిన జయం రవి

తాను ఎన్నో రోజులుగా సహనంతో ఉంటున్నానని.. వ్యక్తిగత విషయాల ఎక్కడా మాట్లాడలేదని నటుడు జయం రవి అన్నారు. ఇప్పుడు మాట్లాడాల్సిన సమయం వచ్చిందన్నారు. తాజా పరిణామాలపై ఆయన మీడియా ముందు మాట్లాడుతూ...తన పిల్లలకు కూడా తనని దూరం చేశారని కన్నీరు పెట్టుకున్నారు. ఇంతకాలం నా వ్యక్తిగత జీవితాన్ని మీతో పంచుకోనందుకు క్షమించండి. విడాకులు వచ్చే వరకూ నా సినిమాలు ఏవీ విడుదల కావు. అప్పటి వరకూ నేను కూడా నటించలేను. నాకు జరిగిన అవమానాలు ఇక భరించడం నా వల్ల కాదు. నన్ను ఇబ్బంది పెట్టాలని చూసేవారు ఆపేవరకూ నేను నటించలేను. ఆఫీసులోనే ఉంటాను. రండి.. ఎంతగా ఇబ్బందిపెడతారో పెట్టండి. ఇకపై నేను మౌనంగా ఉండాలని అనుకోవడం లేదు అంటూ ఎమోషన్ అయ్యారు. నాకు విడాకులు వస్తాయా.. రావా అనేది పక్కన పెడితే నాపై జరుగుతోన్న ట్రోలింగ్ నన్ను బాధిస్తోంది. నా కెరీర్‌లో 95 శాతం చిత్రాలు హిట్. ఎంతో కష్టపడి ఈ స్థాయికి వచ్చా. మహిళల హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేశా. అలాంటి నాపై ఎన్ని నిందలు వేస్తున్నారు. నా పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండాలని నేను లక్షలు పెట్టివాళ్లను చదివించాను. వాళ్లపై నాకున్న ప్రేమ గురించి ఎవరికీ ఏమీ తెలియదు. నాకు ప్రేమలేదని రాసేస్తున్నారు. అవి ఎంత బాధిస్తాయో మీకేం తెలుసు అని బాధపడ్డారు. కేవలం ట్రోలింగ్ కారణంగానే తన స్నేహితురాలు కెనీషాను కోల్పోయానని అన్నారు. ఆమె ఎన్నో వేధింపులు ఎదుర్కొందన్నారు. ఇక తన వ్యక్తిగత జీవితంలో అడ్డంకులు అన్నీ తొలగిపోయిన తర్వాత కచ్చితంగా నటిస్తానని రవిమోహన్ చెప్పారు.

# అగ్రతారల మూవీకి త్రిష దూరం

వరుస సినిమాలతో సందడి చేస్తున్నారు నటి త్రిష. ఇప్పుడు ఆమెకు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అగ్ర కథానాయకులు కమల్ హాసన్ - రజనీకాంత్ కలిసి నటిస్తోన్న చిత్రంలో ఆమెను ఎంపిక చేసినట్లు గతంలో వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో రానున్న ఈ చిత్రం కోసం ఆమె భారీగా పారితోషికం తీసుకోనున్నట్లు కూడా ఎన్నో వార్తలు చక్కర్లు కొట్టాయి. అయితే, తమిళనాడు ఎన్నికల ఫలితాల అనంతరం త్రిష సినిమాల ఎంపికల్లోనూ ఎన్నో విషయాలు ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగానే ఈ సినిమా కోసం ఏకంగా రూ.12 కోట్లు ఆఫర్ చేసినప్పటికీ ఇందులో నటించేందుకు ఆమె సుముఖత చూపించడం లేదని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. కమల్ హాసన్ - రజనీకాంత్ 46 ఏళ్ల తర్వాత కలిసి నటిస్తుండడంతో ఈ ప్రాజెక్ట్‌పై అందరిలో ఆసక్తి నెలకొంది. వీరి స్థాయికి తగినట్లే అగ్రకథానాయికను ఎంపిక చేయాలని టీమ్ త్రిషను తీసుకోనుందని గతంలో వార్తలు వచ్చాయి. భారీ పారితోషికం ఆఫర్ చేసినప్పటికీ ఆమె దీన్ని రిజెక్ట్ చేయడం వెనక బలమైన కారణం ఉందని టాక్. ఈ సినిమాను ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్‌జెయింట్ నిర్మాణసంస్థ తెరకెక్కించడంతో ఆమె తిరస్కరించినట్లు ఆంగ్ల మీడియా పేర్కొంది. అసలు త్రిష ఈ ప్రాజెక్ట్‌లో నటిస్తున్నారా లేదా అనే దానిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ఇక తాజాగా 'వీరభద్రుడు'లో లాయర్ ప్రీతిగా మెప్పించారు త్రిష. ప్రస్తుతం చిరంజీవికి జోడీగా 'విశ్వంభర'లో నటిస్తున్నారు. వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్‌గా రూపొందుతోంది.



# కరీంనగర్‌కు భారీగా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ నిధులే లక్ష్యం

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కృషితో నగరానికి ప్రత్యేక గుర్తింపు**

**మేయర్ కొలగాని శ్రీనివాస్**




కరీంనగర్ నగరాన్ని రాష్ట్రంలోనే కాకుండా దేశస్థాయిలో ఆదర్శవంతమైన, ఆధునిక మౌలిక వసతులు కలిగిన స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దే దిశగా నగరపాలక సంస్థ రూపొందించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) ప్రతిపాదనల పరిశీలనలో భాగంగా ఢిల్లీ నుంచి విచ్చేసిన కేంద్ర బృంద సభ్యుడు దీపు టామ్ కరీంనగర్ నగరంలోని పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృంద సభ్యులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఎస్ఈ మరియు ఇతర ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం నగరంలో ప్రతిపాదించిన అభివృద్ధి ప్రణాళికలు, ఆధునిక రహదారులు, సీసీ డ్రైన్లు, పట్టణ రవాణా సదుపాయాలు, ఆధునిక మౌలిక వసతులు, పర్యావరణ హిత ప్రాజెక్టులు తదితర అంశాలను కేంద్ర బృందానికి సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ... "కరీంనగర్ నగర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం ఆనందకరం. ముఖ్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిరంతర కృషి, పట్టుదల వల్లే కరీంనగర్‌కు కేంద్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభిస్తోంది. భారతీయ జనతా పార్టీ ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తూ కరీంనగర్ నగరానికి భారీ స్థాయిలో నిధులు తీసుకురావడానికి కట్టుబడి ఉంది" అని తెలిపారు. అలాగే... "అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా కరీంనగర్ నగర రూపురేఖలను పూర్తిగా మార్చేలా సమగ్ర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాము. ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలు, విశాల రహదారులు, ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ, హరిత ప్రాంతాలు, స్మార్ట్ సిటీ మౌలిక వసతులు అందించడమే మా ధ్యేయం. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉండటం వల్లే అభివృద్ధి పనులకు వేగం పెరిగింది. కరీంనగర్ నగరాన్ని దేశంలోనే మోడల్ సిటీగా తీర్చిదిద్దుతాము" అని పేర్కొన్నారు. "కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎప్పటికప్పుడు కరీంనగర్ అభివృద్ధి అంశాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ నగరానికి అవసరమైన నిధులు, ప్రాజెక్టులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లో సమతుల అభివృద్ధి చేపడుతున్నాము. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కరీంనగర్ నగర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుంది" అని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కేంద్ర బృందం పలు ప్రతిపాదిత అభివృద్ధి ప్రాంతాలను సందర్శించి అధికారులతో చర్చలు జరిపింది. నగరాభివృద్ధిపై కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ తీసుకుంటున్న ముందడుగు చర్యలను కేంద్ర బృందం అభినందించింది.

# ఖరీఫ్‌లో సన్న వరి సాగుకు రైతులు ముందుకు రావాలి

**అకాల వర్షాల దృష్ట్యా వేగంగా ధాన్యం దిగుమతి**

**మిల్లర్లు లక్ష్యాలకు అనుగుణంగా కొనుగోళ్లు చేయాలి**

**సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి**



హుస్నాబాద్, జనత న్యూస్: వచ్చే ఖరీఫ్‌లో రైతులు సన్న వరి సాగుకు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పిలుపునిచ్చారు. శనివారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాములు, పందిళ్ల గ్రామంలోని రైస్ మిల్లులను పరిశీలించి ధాన్యం దిగుమతి ప్రక్రియను సమీక్షించారు. హుస్నాబాద్ ఏఎంసీలో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యంలోని రెండు గోదాముల్లో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల ధాన్యాన్ని నిల్వ చేస్తున్నామని తెలిపారు. అకాల వర్షాలతో రైతులు నష్టపోకుండా గోదాముల్లో ధాన్యం దిగుమతి చేపడుతున్నామని చెప్పారు. గోదాముల్లో హమాలీలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ అధికారులను ఆదేశించారు. రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం కొరత కారణంగా ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, అందువల్ల రైతులు సన్న వడ్ల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. సన్న వడ్లకు బోనస్ కూడా అందుతుందని తెలిపారు. అనంతరం పందిళ్ల గ్రామంలోని షణ్ముఖ ఇండస్ట్రీస్, గౌరీశంకర్ ఆగ్రో ఇండస్ట్రీస్, పవనసుత ఇండస్ట్రీస్ మిల్లులను పరిశీలించిన కలెక్టర్.. మిల్లర్లు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా ధాన్యం దిగుమతి చేయాలని ఆదేశించారు. వర్షాల కారణంగా స్థానిక వాహనాల ద్వారా ధాన్యం తరలిస్తున్నందున మిల్లర్లు సహకరించాలని కోరారు. దిగుమతిలో జాప్యం లేకుండా హమాలీలను షిఫ్టుల వారీగా వినియోగించాలని, ఓపీఎంఎస్ అప్‌లోడ్ తదితర ప్రక్రియలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సదానందం, తహశీల్దార్ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**ప్రణాళికాబద్ధంగా లక్ష్య సాధన దిశగా ముందుకెళ్లాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**




కరీంనగర్, మే 16: కరీంనగర్ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లక్ష్య సాధన దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆర్డీవోలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మ్యాపింగ్ పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దశను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మ్యాపింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని, ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచనలు చేశారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పనులు పూర్తి చేయాలి**

పద్మనగర్, ఆరేపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పనుల పురోగతి, మౌలిక సదుపాయాలు, పెండింగ్ అంశాలపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ కీలక సూచనలు చేశారు. ఇంకా మిగిలి ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి ఇండ్లను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అన్ని మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనుల పూర్తి విషయంలో ప్రత్యేక దృష్టి సారించి సమయపాలనతో ముందుకు సాగాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ డి. శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్లు లక్ష్మీనరసింహారావు, నరేందర్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

# రెచ్చిపోయిన దొంగలు

**ఆరుబయట నిద్రిస్తున్న మహిళలే టార్గెట్.**

**అప్రమత్తంగా ఉండాలని మండల ప్రజలకు సూచించిన బెజ్జంకి పోలీసులు.**





జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని చిలాపూర్ , రేగులపల్లి గ్రామాలలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని దొంగలు మహిళలపై దాడులకు పాల్పడి బంగారు పుస్తెలతాళ్లు లాక్కెళ్ళినట్లు బెజ్జంకి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తోట తిరుపతి, శనివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. చిలాపూర్ గ్రామానికి చెందిన కొత్త తారవ్వ తన ఇంటి ముందు ఆరుబయట కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమె మెడలో ఉన్న బంగారు తాడును లాక్కోవడానికి ప్రయత్నించగా ఆమె గట్టిగా అరవడంతో కుటుంబ సభ్యులు మేల్కొనగా దొంగలు అక్కడ నుండి పారిపోయారు, ఆమె బంగారు తాడు ఆమె వద్దే ఉంది. అదే గ్రామానికి చెందిన తాడి మేలపల్లి లక్ష్మి ( నిషాని మణెమ్మ) ఇంటిముందు నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పారిపోయాడు, మళ్లీ రేగులపల్లె గ్రామానికి చెందిన భూపతి లాస్య ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో చిలాపూర్ తరహాలో దొంగ సుమారు మూడు తులాల పుస్తెలతాడును లాక్కొని ఫరారయ్యాడు. ఇట్టి విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, ప్రజలు రాత్రి సమయంలో ఆరుబయట నిద్రించ రాదని, అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు లేదా 100కు సమాచారం అందించాలని మండల ప్రజలకు బెజ్జంకి పోలీసులు సూచించారు.

# చెరువు మట్టి సేంద్రియ ఎరువు

**గూడెం గ్రామ రైతులు.**



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని గూడెం గ్రామంలో గల మైసమ్మ కుంట చెరువు లో చాలా సంవత్సరాల నుండి పూడిక తీయకపోవడంతో , మట్టి పేరుకుపోవడంతో వర్షాకాలంలో ఎక్కువ నీరు నిలువక, చెరువు కింద పొలాల రైతులకు నీరు సరిపోవడం లేదనే, ఉద్దేశంతో గ్రామ రైతులు కుంటలోని మట్టిని సేంద్రియ ఎరువు కింద ట్రాక్టర్లతో తీసుకెళ్లి తమ పొలాలలో పోసుకోవడం జరుగుతుంది. ఈ విషయంపై శనివారం రైతులను పత్రిక మిత్రులు ప్రశ్నించడంతో వారు కుంటలో మట్టి తీయడం ద్వారా వర్షపు నీరు ఎక్కువ నిలువ ఉండి పంటలకు ఉపయోగపడతాయని, కుంటలోని మట్టి సహజ సేంద్రియ ఎరువుగా పనిచేసి పంట దిగుబడి ఎక్కువగా వస్తాయని మట్టిని తీసుకుంటున్నట్లు, అలాగే వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో వేగవంతంగా కుంట పూటిక తీయాలనే ఉద్దేశంతో కూలీల స్థానంలో ట్రాక్టర్లను , జెసిపి మిషనరీ ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

# ఆటోను తాళ్లతో లాగుతూ నిరసన తెలిపిన మండల సిపిఐ పార్టీ




జనత న్యూస్ బెజ్జంకి : కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ మండల కేంద్రంలో శనివారం సిపిఐ పార్టీ బెజ్జంకి శాఖ ఆటోను తాళ్లతో లాగుతూ వినూత్నంగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల సిపిఐ పార్టీ కార్యదర్శి బోనగిరి రూపేష్ మాట్లాడుతూ లీటరుకు మూడు రూపాయలు పెంపుతో ప్రజలపై భారం పడుతుందని, అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధాల వల్ల చమురు ధరలు పెరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరల వల్ల రవాణా రంగం, రైతులు, సాధారణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెంచిన ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించాలని పార్టీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బోనగిరి మహేందర్, నాయకులు సంగెం మధు, కల్లూరి బాలమల్లు, బోనగిరి శ్రావణ్, దొంతర వేణి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో.. నిర్ణీత గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేయాలి

**హుస్నాబాద్ - కొత్తపల్లి నాలుగు వరుసల రహదారి పనుల పరిశీలనలో కలెక్టర్ హైమావతి**



హుస్నాబాద్,జనత న్యూస్:హుస్నాబాద్ నుంచి కొత్తపల్లి వరకు రూ.77.20 కోట్లతో చేపట్టిన నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి విస్తరణలో భాగంగా ఇరువైపులా చెట్ల నరికివేత, పొదల తొలగింపు ప్రక్రియ దాదాపు పూర్తయిందని తెలిపారు. విద్యుత్ స్తంభాల మార్పిడి (షిఫ్టింగ్) పనులు సైతం వేగంగా సాగుతున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న చెట్ల తొలగింపుతో పాటు, మార్కింగ్ చేసిన నివాసాల (నిర్మాణాల) తొలగింపు ప్రక్రియను మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్ సంయుక్తంగా పర్యవేక్షించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారి నిర్మాణంలో ఎక్కడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశిత కాలవ్యవధిలోనే పనులన్నీ పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.కలెక్టర్ వెంట ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ లక్ష్మారెడ్డి, విద్యుత్ శాఖ డీఈ తదితర అధికారులు ఉన్నారు.

# శ్రీ శారద సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా "చిట్టి చేమంతుల సినీ గీతాలు"



కరీంనగర్, మే 16: కరీంనగర్ నగరంలోని కళాభారతిలో శ్రీ శారద సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన "చిట్టి చేమంతుల సినీ గీతాలు" కార్యక్రమం ఘనంగా జరిగింది. చిన్నారులు ఆలపించిన సినీ గీతాలు, సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రావుల అపర్ణ, నరేష్ కుమార్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. చిన్నారుల ప్రతిభను అభినందిస్తూ వారు మాట్లాడుతూ సంగీతం పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శ్రీ శారద సంగీత విద్యాలయం నిర్వాహకురాలు బొజ్జ రేవతి మాట్లాడుతూ చిన్నారుల్లో సంగీతంపై ఆసక్తి, అభిరుచిని పెంపొందించడమే లక్ష్యంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు సినీ గీతాలతో పాటు పలు సంగీత ప్రదర్శనలు అందించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు. తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఆల్ ఇండియా పోలీస్ క్రీడల్లో కరీంనగర్ ఏఎస్సై ఉమారాణికి కాంస్య పతకం

**సీపీ గౌష్ ఆలం అభినందనలు**



కరీంనగర్, మే 16: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో నిర్వహించిన అఖిల భారత పోలీస్ క్రీడా పోటీల్లో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ఉమెన్ ఏఎస్సై పల్లి ఉమారాణి కాంస్య పతకం సాధించి ప్రతిభ చాటారు. ఈ నెల 9 నుండి 13 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ఉమారాణి తెలంగాణ పోలీస్ శాఖ తరపున పాల్గొన్నారు. 50 ఏళ్ల మహిళల డబుల్స్ విభాగంలో ఆమె అద్భుత ప్రదర్శన కనబరిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. జాతీయ స్థాయిలో రాణించి జిల్లా, రాష్ట్ర పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకువచ్చారు. పోటీలు ముగించుకొని నగరానికి చేరుకున్న ఉమారాణి శనివారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె సాధించిన పతకం, సర్టిఫికేట్‌ను సీపీకి చూపించారు. ఉమారాణి ప్రతిభను సీపీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించారు. 50 ఏళ్ల వయసులో విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం ఎందరికో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొని ఉమారాణికి అభినందనలు తెలిపారు.

# నల్సా పథకాలపై మహిళలకు న్యాయ అవగాహన

## పోక్సో, మహిళల రక్షణ చట్టాలపై ప్రత్యేక సదస్సు




మానకొండూర్ (కరీంనగర్), మే 16: జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ (నల్సా) పథకాలపై మానకొండూర్ మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే. రాణి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం జరిగింది. ఈ సదస్సులో సభ్యులు, న్యాయవాదులు ఏ. కిరణ్ కుమార్, పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి మహిళా సంఘాల ప్రతినిధులు, సభ్యులకు వివిధ న్యాయ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్సా రూపొందించిన "సురక్షితమైన బాల్యం - సురక్షితమైన భవిష్యత్తు కోసం జాగృతి పథకం - 2025" కింద లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం--2012 (పోక్సో), మనుషుల అక్రమ రవాణా మరియు వాణిజ్య లైంగిక దోపిడీ బాధితుల పథకం--2015పై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పసిపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు, మహిళలను అక్రమ రవాణా మరియు దోపిడి నుండి రక్షించేందుకు చట్టాలను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చట్టం పుస్తకాల్లో మాత్రమే ఉండకుండా సామాన్య ప్రజలకు అండగా నిలబడినప్పుడే దానికి సార్థకత ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయం, పరిహారం, పునరావాస పథకాల గురించి వివరించారు. ఒక మహిళకు చట్టంపై అవగాహన ఉంటే ఆ కుటుంబం సురక్షితంగా ఉంటుందని, మహిళా సంఘాలకు చట్టంపై అవగాహన పెరిగితే గ్రామమే రక్షణ కవచంలా మారుతుందని అన్నారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు న్యాయ సహాయం కోసం 15100, మహిళా హెల్ప్‌లైన్ కోసం 1091, చైల్డ్‌లైన్ కోసం 1098 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న దాడులు, దోపిడీలను మౌనంగా భరించకుండా చట్టపరంగా ఎదుర్కోవాలని కోరారు. గ్రామాల్లో న్యాయ చైతన్యం పెంపొందించేందుకు మహిళా సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ డి. రాజేందర్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లావణ్య, అకౌంటెంట్ రజిత, మండల పరిధిలోని మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బక్రీద్ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు: సీపీ గౌష్ ఆలం**

**గోవుల అక్రమ రవాణా అరికట్టేందుకు 6 చెక్‌పోస్టుల ఏర్పాటు**



కరీంనగర్, మే 16: రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో శనివారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్లో విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్, గోరక్ష ప్రముఖ్ తదితర హిందూ మత సంఘాల ప్రతినిధులతో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ పండుగ వేళ ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణా లేదా గోవధకు సంబంధించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, చట్టాన్ని అతిక్రమించే చర్యలకు పాల్పడరాదని హెచ్చరించారు. తెలంగాణ గోవధ నిషేధ మరియు జంతు సంరక్షణ చట్టం--1977 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గోవుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పశువుల రవాణాకు సంబంధించి వెటర్నరీ వైద్యులు జారీ చేసే "ఫిట్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్" ధ్రువపత్రాలను తప్పనిసరిగా తనిఖీ చేస్తామని వెల్లడించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు కమిషనరేట్ పరిధిలో ఆరు వ్యూహాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరీంనగర్ రూరల్ ముగ్దుంపూర్, కొత్తపల్లి మండలం చింతకుంట, చొప్పదండి మండలం ఆర్నకొండ, గంగాధర మండలం తుర్కాసినగర్, తిమ్మాపూర్ మండలం రేణికుంట, హుజురాబాద్ పరకాల క్రాస్ రోడ్డులో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రానున్న రెండు వారాల పాటు ఈ చెక్‌పోస్టుల వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా సరిపడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చట్టవిరుద్ధంగా పశువుల అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి, సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, హిందూ సంఘాల నాయకులు ఉట్కూరి రాధాకృష్ణ రెడ్డి, రమేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర ముఠాల కదలికలపై కట్టుదిట్టమైన నిఘా

**బ్యాంకులు, జ్యువెలరీ షాపులకు పోలీసుల భద్రతా సూచనలు**

**24 గంటల పెట్రోలింగ్, విస్తృత నాకాబందీలతో అప్రమత్తమైన కరీంనగర్ పోలీసులు**






కరీంనగర్, మే 16: ఇటీవల అంతరాష్ట్ర సాయుధ ముఠాలు బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. ఇటీవల పీఎంజే జ్యువెలర్స్‌లో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని అన్ని వ్యాపార, ఆర్థిక సంస్థల యాజమాన్యాలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సంస్థల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, క్యాష్ కౌంటర్లు, లాకర్ గదులు పూర్తిగా కవర్ అయ్యేలా హై రిజల్యూషన్ నైట్ విజన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కనీసం 90 రోజుల పాటు ఫుటేజీ భద్రపరిచే విధంగా వ్యవస్థ ఉండాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లు, కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానించిన బర్గ్లర్ అలారాలు, పానిక్ బటన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గుర్తింపు పొందిన శిక్షణ కలిగిన సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని, నగదు, బంగారం రవాణా సమయంలో గోప్యత పాటించాలని తెలిపారు. సంస్థల్లో పనిచేసే శాశ్వత, తాత్కాలిక సిబ్బందికి పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలని ఆదేశించారు. హెల్మెట్ ధరించి అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో నేరగాళ్లను ఎదుర్కొనే ప్రయత్నం చేయకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మరోవైపు అంతరాష్ట్ర ముఠాల కదలికలను అణచివేసేందుకు నగరంలో విస్తృత నిఘా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బ్యాంకులు, ఏటీఎంలు, వాణిజ్య సముదాయాల వద్ద బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాలతో 24 గంటల పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. నగర ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, జాతీయ రహదారులపై ఆకస్మిక నాకాబందీలు, వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్పెషల్ బ్రాంచ్, టాస్క్ ఫోర్స్, స్థానిక పోలీసులు సమన్వయంతో పనిచేస్తూ అంతరాష్ట్ర ముఠాలు, చోరీ సొత్తును కొనుగోలు చేసేవారిపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల పోలీసులతో సమాచార మార్పిడి కొనసాగుతోందన్నారు. లాడ్జీలు, హోటళ్లు, అద్దె ఇళ్లు, కొత్తగా వచ్చిన అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక వెరిఫికేషన్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, వ్యాపారుల సహకారం పోలీసులకు ఎంతో అవసరమని సీపీ గౌష్ ఆలం పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపించిన వెంటనే డయల్ 100 లేదా 112కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆస్తుల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు కరీంనగర్ పోలీస్ యంత్రాంగం పూర్తి అంకితభావంతో పనిచేస్తుందని స్పష్టం చేశారు.

# బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా అడిచెర్ల రాజు నియామకం



కరీంనగర్, మే 16: భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అడిచెర్ల రాజును నియమించారు. ఈ మేరకు బీజేపీ తెలంగాణ రాష్ట్ర పార్టీ అధికారిక నియామక ఉత్తర్వులను విడుదల చేసింది. రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన అడిచెర్ల రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఓబీసీ మోర్చా రాష్ట్ర కమిటీలో ఆఫీస్ బేరర్‌గా అవకాశం కల్పించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా అడిచెర్ల రాజు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బలోపేతంతో పాటు ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com